గురువారం
30-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 129
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కనిష్క కుట్రదారు హంతకుడికి జీవిత ఖైదు

వాషింగ్టన్: ఎయిర్ ఇండియా కనిష్క విమానం పేలుడు కేసులో కుట్రదారు రిపుదమన్ సింగ్ మాలిక్‌ను హత్య చేసిన టాన్నెర్ ఫాక్స్‌కు జీవితఖైదు విధించారు. ఈ మేరకు బ్రిటిష్ కొలంబియా సుప్రీంకోర్టు న్యాయమూర్తి టెరెన్సీ ఫుల్టెస్ తీర్పు వెలువరించారు. ఇదే కేసులో దోషితోపాటు సహ నిందితుడిగా ఉన్న జోసెలోపేజ్‌పై గత అక్టోబర్‌లోనే నేర నిర్ధారణ జరిగింది. ఫిబ్రవరి 6వ తేదీన అతడిపై విచారణ జరగనుంది. తాము డబ్బులు తీసుకొని మాలిక్‌ను హత్య చేసినట్లు వీరిద్దరూ అంగీకరించారు. 2022లో సర్రే ప్రాంతంలో కొందరు దుండగులు మాలిక్‌ను చంపారు. మాలిక్ తన కారులో వెళ్తుండగా అడ్డగించిన దుండగులు అతడిపై కాల్పులు జరపడంతో, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. ఏపీలో రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. ఫిబ్రవరి మూడో తేదీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. మూడో తేదీ నుంచి 10 వరకూ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న స్క్రూటినీ నిర్వహించనున్నట్లు

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌కు సమన్లు

చండీగఢ్: ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కార్యదర్శి, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు హర్యానా కోర్టు సమన్లు జారీ చేసింది. ఢిల్లీకి నీటి సరఫరాను అడ్డుకునేందుకు హర్యానా పాలకులు యమునా నదిని విషపూరితం చేశారంటూ ఢిల్లీ ఎన్నికల వేళ ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. దీంతో కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై హర్యానా ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. యమునా నది నీటిని విషపూరితం చేసినట్లు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే చేసిన అసత్య వ్యాఖ్యలతో అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని

- మిగతా 2 లో

పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై విచారణ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అటవీ భూముల భక్షణపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విచారణకు జాయింట్ కమిటీ ఏర్పాటయింది. కమిటీ సభ్యులుగా చిత్తూరు కలెక్టర్ సుమిత్, ఎస్పీ మణికంఠ చందోలు, ఐఎఫ్ఎస్ అధికారి యశోద బాయ్ ఉంటారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

మహా విషాదం

అర్ధరాత్రి వేళ ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో తొక్కిసలాట

30 మంది మృతి... వందలమందికి గాయాలు

- భయాందోళనకు గురైన భక్తజనం
- మృతులకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- ఘటనపై జ్యుడిషియల్ విచారణ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తొక్కిసలాట జరిగింది. మౌని అమావాస్య సందర్భంగా అమృత స్నానాలు ఆచరించేందుకు సంగమం వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల తాకిడికి బారికేడ్లు విరగడంతో ఒకరిపై ఒకరు పడిపోయి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 30 మంది మృతిచెందగా, వందల మంది గాయపడినట్లు తెలిసింది. కాగా వెంటనే స్పందించిన సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. మౌని అమావాస్య నాడు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయనేది విశ్వాసం. ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందనే నమ్మకంతో నేడు కుంభమేళాకు భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే కొందరు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించగా.. అవి విరిగిపోయాయి. దీంతో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి చేయి దాటిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంట తెచ్చుకున్న బ్యాగులు, లగేజీలతో పరిగెత్తలేక కొంతమంది కింద పడిపోయారు. అధికారులు అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, రద్దీ ఎక్కువగా ఉండటంతో ఒకానొక దశలో అంబులెన్స్‌కు కూడా దారి లేని పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి అంబులెన్స్‌లకు మార్గం చూపారు. తొక్కిసలాటతో ఘటనాస్థలంలో భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడిపోయాయి. తమ వస్తువులను వెతుక్కోవడం కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రయాగ్‌రాజ్‌లో పరిస్థితులు అదుపులోకి వచ్చినప్పటికీ భక్తుల రద్దీ మాత్రం విపరీతంగానే ఉంది. ఇప్పటికే దాదాపు 4 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించగా.. ఇంకా కోట్ల మంది వేచి చూస్తున్నారు. తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అమృతస్నానం కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్లు అఖాడాలు ప్రకటించారు. కాగా ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. కాగా తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మహాకుంభ్ డీఐజీ వైభవ్‌కృష్ణ మీడియాకు వెల్లడించారు. అర్ధరాత్రి 1-2 గంటల మధ్య ఒకట్రెండు చోట్ల తొక్కిసలాట జరిగిందని.. బారికేడ్లు ధ్వంసం కావడం వల్లే

- మిగతా 2 లో

అరకొర ఏర్పాట్లు... వీఐపీ సంస్కృతి
8లో

ఇస్రో వందో ప్రయోగం
విజయవంతం

నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్15

ఇది చారిత్రక విజయం: చైర్మన్ నారాయణన్

విశాలాంధ్ర–సూళ్లూరుపేట: ఇస్రో చరిత్రాత్మక వందో ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్... ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని తీసుకొని నింగిలోకి దూసుకెళ్లింది. బుధవారం ఉదయం 06.23 నిమిషాలకు ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలోకి ఇస్రో ప్రవేశపెట్టింది. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం... ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. దీని బరువు 2,250 కిలోలు. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు ఇది మొదటి ప్రయోగం కావడంతో ఆయనే స్వయంగా అన్ని ప్రక్రియలనూ పర్యవేక్షించారు. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్ సేవల కోసం ఈ ఉపగ్రహ ప్రయోగం ఉపయోగపడనుంది. వ్యవసాయంలో సాంకేతికత,

- మిగతా 2 లో

వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటా సరికాదు

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 'మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. మనమంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం. అందువల్ల ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు.

ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా ఉంది' అని ధర్మాసనం వెల్లడించింది. నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకేనని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే... ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది. పీజీ మెడికల్ కోర్సులకు నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ

- మిగతా 2 లో

ఆర్ఎస్ఎస్, బీజేపీ బ్రిటీష్ తొత్తులు

- స్వాతంత్ర్య పోరాటంలో మతోన్మాదుల పాత్ర శూన్యం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ

విశాలాంధ్ర– విశాఖ: కేంద్రంలో ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వం నడుస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో విశాఖలోని పౌర గ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర–భవిష్యత్తు సవాళ్లు' అంశంపై బుధవారం జరిగిన సదస్సులో రాజా మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజ్యాంగంలో పేర్కొన్న లౌకికరాజ్యం విధానానికి తూట్లు పొడుస్తోందని రాజా విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా మోదీ సర్కారు పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. జాతిపిత మహాత్మాగాంధీ దేశంలో హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను కోరుకున్నారని తెలిపారు. గాంధీని చంపిన గాడ్సేని దేశభక్తుడని ఆర్ఎస్ఎస్, బీజేపీ పేర్కొంటున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర పోషించకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం బీజేపీ నేడు అధికారంలో ఉండడం దురదృష్టకరమని రాజా వ్యాఖ్యానించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన తొలి రాజకీయ పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. స్వతంత్ర పోరాటంలో అనేక మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు రక్తం, స్వేదం చిందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తరువాత దేశ సమైక్యత, భాషా రాష్ట్రాలు, ఫెడరల్ వ్యవస్థ కోసం సీపీఐ కృషి చేసిందని తెలిపారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరిగిన తరువాత దేశానికి నిజమైన స్వాతంత్రం వచ్చిందని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ పేర్కొనడాన్ని రాజా ఖండించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేదని అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశాన్ని తిరోగమనం వైపు బీజేపీ తీసుకెళ్తోందని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకిక, సోషలిస్టు పదాలు తొలగించాలని కోరుతూ కొందరు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిందని చెప్పారు. కాన్పూర్‌లో 1925లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించినప్పుడు... ఆదిలోనే దాన్ని అంతం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కాన్పూర్ సమావేశానికి హాజరైన నాయకులను బ్రిటిష్ పాలకులు వెతికి పట్టుకొని జైళ్లలో పెట్టారని, అయినా పార్టీ నాయకులు వెనక్కి తగ్గకుండా పోరాటాలు సాగించారని తెలిపారు. రాష్ట్రానికి మూడు లక్షల కోట్లు ఇచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, ఆ నిధులతో సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొడతానని చెప్పిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చిన తరువాత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. న్యాయమూర్తులు సైతం అదానీ పేరు వింటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ ముడుపుల వ్యవహారం అమెరికాలో వెలుగులోకి వచ్చిందని, అక్కడి నుంచి వివరాలు తెప్పించుకుంటానని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సీపీఐ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు మాట్లాడుతూ భవిష్యత్తులో నాయకులు లేకుండానే ప్రజలే తిరగబడే పరిస్థితులు రాబోతున్నాయని అమెరికాకు చెందిన ఉల్ఫ్ పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ భవిష్యత్తులో ప్రజలే పోరాటాలకు సిద్ధపడతారని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులపై ప్రభుత్వాలు

- మిగతా 2 లో

బీజేపీ దురాలోచన వీడాలి

- పేదలకు ఎర్రజెండా అండ
- ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం
- సీపీఐ శతవార్షికోత్సవ సభలో 'చాడ'

విశాలాంధ్ర–హనుమకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలన్న దురాలోచన చేస్తోందని, అది హాస్యాస్పదమని, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు నిర్వహించే ఎర్రజెండా వీరులకు అంతం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సీపీఐ శతవార్షికోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ ఏకశిలా పార్కు నుంచి పార్టీ జిల్లా సమితి అధ్వర్యంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కాకతీయ హరిత హోటల్‌లో వందేళ్ల వార్షికోత్సవ సభ జిల్లా కార్యదర్శి కర్రె

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నీకసలు జాలీ, దయా లేవా? రాష్ట్రం ఈ రేంజిలో అప్పుల్లో ఉంటే నీ గొడవేగాని ఆయన గొడవ పట్టదా?

ఇంటింటి సర్వే దేశానికే ఆదర్శం

- రెండు రోజుల్లో ముసాయిదా
- 2న కేబినేట్ సబ్ కమిటీకి తుది నివేదిక
- 1.16 కోట్ల కుటుంబాల వివరాల సేకరణ: రేవంత్

విశాలాంధ్ర–హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశానికే ఆదర్శమని, ఇది అందరి దృష్టిని ఆకర్షించిందని, ఈ సర్వేపై ప్రశంసలు అందుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విజయవంతమైన సమగ్ర కులగణనపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. కులగణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటేడ్ కమిషన్ కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని అన్నారు. సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందని, ఒకటి రెండు

- మిగతా 2 లో

సాయుధ పోరాట సేనానులు - 2

వర్గ స్వభావం అన్ని వర్గాలవారికీ ఉండొచ్చు. కానీ సంపన్న వర్గాలకు చెందిన కుటుంబాల నుంచి వచ్చినా తమ వర్గ స్వభావాన్ని విడనాడి పీడితుల పక్షాన నిలబడ్డ వారూ ఉంటారు. తన వర్గ స్వభావాన్ని వదులుకుని రావి నారాయణరెడ్డితో కలిసి సాయుధ పోరాటంలో పాల్గొన్న త్యాగశీలి బద్దం ఎల్లారెడ్డి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు

విశాలాంధ్ర–హైదరాబాద్: ఆయిల్ పామ్ సాగులో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సాగు చేపట్టలన్నారు. ఈ ఏడాదిలో 16,729 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టినట్లు చెప్పారు. మార్చిలోగా 19,271 ఎకరాలలో సాగు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ జూన్ నాటికి పూర్తి చేసి, గెలల ప్రాసెసింగ్ చేపట్టాలని ఆదేశించారు. బీచ్ పల్లి, కల్లూరు గూడెంలలో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపట్టి, పనులు ప్రారంభించాలన్నారు. వివిధ విభాగాల్లో నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను రైతులు, పవర్ లూమ్ పరిశ్రమకు అందించాలని సెస్ అధికారులను మంత్రి ఆదేశించారు. చేనేత జౌళి శాఖ, చేనేత అభయ హస్తం పథకంను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలన్నారు. మరమగ్గాల యూనిట్లకు 25 హెచ్.పి వరకు 50శాతం విద్యుత్ సబ్సిడీ అమలు చేయాలని,

- మిగతా 2 లో

ఉద్యోగులపై ట్రంప్ కత్తి

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా ట్రంప్ సర్కారు బైఅవుట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి మెమో వెలువడింది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలు, ప్రవర్తన, అనుకూలతలు పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఒక ఈమెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు ఓ నిర్ణయానికి రావాలని దానిలో వెల్లడించారు. ఉద్యోగాలు మానేద్దామని అనుకొని ఆగిపోయినవారు దీనిని ఎంచుకోవచ్చు. కోవిడ్ తర్వాత చాలామంది ఉద్యోగులు రిమోట్ విధానంలో పని చేస్తున్నారు. తాజాగా వారు వారానికి ఐదు రోజులు ఆఫీసులకు రావాలని ట్రంప్ సర్కారు తేల్చిచెప్పింది. ఈ కార్యాలయాల్లో విధులకు హాజరుకావడం ఇష్టం లేని ఉద్యోగులు దీనిని ఎంచుకోవచ్చని చెబుతున్నారు. సుమారు 10-15 శాతం మంది దీనిని ఎంచుకోవచ్చని భావిస్తున్నారు. ఇది విజయవంతంగా అమలైతే అమెరికా ప్రభుత్వ ఖర్చులు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. ఓవైపు ఫెడరల్ నిధులు, రుణాలు నిలిపివేసిన వేళ ఈ వార్త బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. చాలా స్థానిక సంస్థల ప్రభుత్వాలు, నాన్ ప్రాఫిట్ సంస్థలపై దీని ప్రభావం ఉండనుంది. గతేడాది చివరికి అమెరికాలో దాదాపు 30 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దేశం మొత్తం ఉద్యోగుల్లో ఇది 1.9 శాతానికి సమానం. ప్యూ రీసెర్చి సెంటర్ లెక్కల ప్రకారం ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి సగటున 12 ఏళ్లపాటు పని చేస్తాడు. తాజాగా ట్రంప్ ప్రతిపాదనను కొద్ది శాతం మంది ఆమోదించినా... అది ప్రభుత్వ పాలన, ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అనుభవం ఉన్న ఫుడ్ఇన్‌స్పెక్టర్లు, నీటి పరీక్షల విభాగం, వైమానిక రంగం, నిత్యావసర వస్తువుల రక్షణకు సంబంధించిన ఉద్యోగుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. మరోవైపు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీ మాట్లాడుతూ దీనిని వలంటరీ బైఅవుట్‌గానే చూడాలన్నారు.

సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

తొమ్మిది మంది భారతీయుల మృతి

జెద్దా: సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు జెద్దాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మృతుల కుటుంబ సభ్యులతో పాటు భారత్‌లోని అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని, వారికి పూర్తి సహకారం అందిస్తున్నట్లు 'ఎక్స్'లో తెలిపింది. అయితే, ఈ ప్రమాదం ఎలా జరిగింది? మృతులు ఏ ప్రాంతాలకు చెందినవారనే వివరాలు వెల్లడించలేదు. 'సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మంది భారతీయులు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం.

బాధిత కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. జెద్దాలోని భారత కాన్సులేట్ జనరల్ పూర్తి సహకారం అందిస్తోంది. భారత్‌లోని అధికారులు, బాధిత కుటుంబాలతో సంప్రదిస్తున్నాం. ఈ ఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం' అని పేర్కొంది. మరోవైపు, ఈ విషాద ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. ప్రమాదంలో భారత పౌరుల మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతోన్న జెద్దాలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నడక మర్చిపోయా: సునీతా విలియమ్స్

ఫ్లోరిడా: మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాల వల్ల నెలలతరబడి అక్కడే చిక్కుకుపోయారు. ఆమె తిరిగి భూమ్మీద ఎప్పుడు అడుగుపెడతారో స్పష్టత లేదు. అంతరిక్షం నుంచి ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీరో గ్రావిటీ వద్ద నెలల తరబడి గడపడంతో కూర్చోవడం, పడుకోవడం కష్టమేనని అన్నారు. 'నేను చాలాకాలంగా ఇక్కడ ఉంటున్నాను. నడక ఎలా ఉంటుందో గుర్తుచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఇంతకాలంగా నేను నడవలేదు. కూర్చోలేదు. పడుకొని విశ్రాంతి తీసుకోవడానికి వీలులేకుండా పోయింది. జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండటంతో నేలపై నడిచిన అనుభూతిని గుర్తుతెచ్చుకోలేకపోతున్నాను' అని సునీత వెల్లడించారు. 'మా మిషన్ ప్రకారం నెల రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగి రావాలి. కానీ ఇంతకాలం ఇక్కడ ఉండటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది' అని తెలిపారు. ఎనిమిది రోజుల మిషన్‌లో భాగంగా సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ గత జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సిఉండగా... వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దాంతో వారు ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఇదిలాఉంటే... వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని, వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందని తాజాగా ఎలాన్ మస్క్ విమర్శించారు. సురక్షితంగా తీసుకురావాలని స్పేస్‌ఎక్స్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారని, త్వరలో ఆ పని పూర్తి చేస్తామని మస్క్ తెలిపారు.

'మహా' విషాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతుల్లో 25 మంది ఆచూకీ గుర్తించామని... మరో ఐదుగురిని గుర్తించాల్సి ఉందన్నారు. తొక్కిసలాట ఘటనలో 60 మంది గాయపడ్డారని డీఐజీ చెప్పారు.

ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం సాధారణ పరిస్థితి నెలకొందని.. వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 1920ను సంప్రదించాలని డీఐజీ సూచించారు. కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతులకు యూపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బాధిత కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. జ్యుడిషియల్ కమిషన్ ఈ అంశాన్ని దర్యాప్తు చేసి.. నిర్ణీత కాల వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే సీఎస్, డీజీపీ స్వయంగా ఒకసారి ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి ఆయా అంశాలను పరిశీలిస్తారని తెలిపారు.

మృతుల్లో నలుగురు కర్నాటకవాసులు

కుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో నలుగురు కర్నాటకలోని బెళగావికి చెందిన వారిగా అధికారులు గుర్తించారు. ఇందులో ఇద్దరు తల్లీ కూతురు కాగా.. మరో ఇద్దరు శెట్టి గల్లీ, శివాజీ నగర్‌లకు చెందిన వారుగా గుర్తించారు. మృతదేహాలను తీసుకొచ్చేందుకు ప్రయాగ్‌రాజ్‌కు సీనియర్ అధికారుల బృందాన్ని పంపిస్తున్నట్లు బెళగావి ఎమ్మెల్యే ఆసిఫ్ సియాత్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున కర్నాటక ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బెళగావి నుంచి దాదాపు 300 మంది కుంభమేళాకు వెళ్లినట్లు స్థానిక పోలీసులు అంచనా వేస్తున్నారు.

యోగికి ప్రధాని ఫోన్

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఘటనపై ఆరా తీశారు.

మరోవైపు, సీఎం యోగి "త్రివేణి సంగమం ప్రధాన కేంద్రం వద్దకు రాకుండా సమీపంలోని ఘాట్ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించండి. ఆదేశాలు, సూచనలను పాటిస్తూ అధికారులకు సహకరించండి. ఎలాంటి వదంతులను ప్రకటన విడుదల చేసింది. కుంభమేళాకు భక్తులు పోటెత్తడం వల్ల అటుగా వెళ్లే జాతీయ రహదారిపై భారీ రద్దీ నెలకొంది. దాదాపు 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అయితే తొక్కిసలాట ఘటన తీవ్రమైనది కాదని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆకాంక్ష రాణా తెలిపారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారని చెప్పారు.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధితులకు అందుతున్న వైద్య సాయంపై ఆరా తీసినట్లు ప్రధాని వెల్లడించారు. "ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటన బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.

"ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో చోటుచేసుకున్న విషాదం తీవ్ర విచారకరం. ఈ ఘటనతో తమ ప్రియమైన వారిని కోల్పోయిన భక్తులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులకు స్థానిక యంత్రాంగం అన్నివిధాలా సాయం చేస్తోంది. దీని గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోనూ మాట్లాడా. రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల రద్దు

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ్ జంక్షన్ నుంచి ప్రయాగ్‌రాజ్ కు వెళ్లడానికి ఏర్పాటుచేసిన ప్రత్యేక రైళ్లను నిలిపివేసినట్లు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ మనీష్ కుమార్ తెలిపారు. అధికారుల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సాధారణ రైళ్లు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు త్రివేణి సంగమం ఘాట్‌కు భక్తులు వస్తున్న వాహనాలు, బస్సులను ప్రయాగ్‌రాజ్ సరిహద్దుల్లో 24 గంటల పాటు నిలిపివేశామన్నారు. కుంభమేళా ప్రాంతంలో ఇప్పటికే పది కోట్ల మంది ప్రజలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తుండడంతో 24 గంటల పాటు ఇతరులను అనుమతించట్లేదని జిల్లా కలెక్టర్ దినేష్ చంద్ర పేర్కొన్నారు. మరోవైపు.. ఇతర ప్రాంతాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్న రైలు సదుపాయాలను ఆపివేయలేదని భారతీయ రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ నుంచి భక్తులను తిరిగి తీసుకువెళ్లేందుకు అదనంగా దాదాపు 360 ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేశామన్నారు. రైల్వేస్టేషన్‌లో రద్దీని ఎప్పటికప్పుడు నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తొక్కిసలాటకు కారణాలు ఇవేనా?

లక్నో: మౌని అమవాస్య కావడంతో మహాకుంభమేళాకు కోట్లాది మంది భక్తులు వస్తారని ముందే అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని, అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటిస్తూవచ్చింది. కానీ బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట కారణంగా పదుల సంఖ్యలో భక్తులు చనిపోయారు. మహా కుంభమేళ ప్రాంగణంలో ఏమి జరుగుతుందో కాసేపు ఎవరికి అర్థం కాలేదు. అసలు కుంభమేళాలో తొక్కిసలాటకు గల కారణాలు పరిశీలించినట్లయితే... మౌని అమవాస్య కావడంతో పది కోట్ల మందికిపైగా భక్తులు వస్తారని తెలిసినప్పటికీ అనుకున్నస్థాయిలో ఏర్పాట్లు చేయడకపోవడాన్ని ఒక కారణంగా చెబుతున్నారు. క్యూలైన్లను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో తొక్కిసలాట జరిగిందని కొందరు భక్తులు అభిప్రాయపడుతున్నారు. వెలుతురు సరిగ్గా లేకపోవడం, చీకటిగా ఉండటం కారణంగా తొక్కిసలాట జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చెత్త వేయడానికి ఏర్పాటు చేసిన ఇనుప డెస్ట్‌బిన్లు తెల్లవారుజామున కనిపించకపోవడంతో వాటిని తన్ని చాలామంది కింద పడిపోయారని, దీంతో కింద పడినవాళ్ల మీద నుంచి నడుచుకుంటూ వెళ్లడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీ భక్తుల తాకిడి అధికంగా ఉండటం తొక్కిసలాటకు ఒక కారణంగా చెబుతున్నారు. క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులను బ్యాచ్‌లవారీ స్నానాలకు అనుమతిస్తే రద్దీలో తొక్కిసలాటకు అవకాశం లేకుండా ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధిక రద్దీతో పాటు భక్తులు ముందుకు కదలకపోవడంతో తోపులాట జరిగిందని మరికొందరు చెబుతున్నారు.

విపరీతమైన రద్దీతో స్నానాలకు ఎటు వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితులే తోపులాటకు కారణమనే వాదన వినిపిస్తోంది పుణ్య స్నానాలకోసం వచ్చే భక్తులకు సరైన మార్గదర్శకత్వం లేకపోవడమూ తొక్కిసలాటకు కారణమనే అభిప్రాయాన్ని కొందరు భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మహాభా కుంభమేళాలో తొక్కిసలాటకు కారణం ఏమిటనేదానిపై పోలీసులు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందనే అభిప్రాయాన్ని భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

ఇస్రో వందో ప్రయోగం విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

విమానాల నిర్వహణ, మొబైల్ పరికరాల్లో లోకేషన్ ఆధారిత సేవలందించనుంది. అనంతరం ఇస్రో చైర్మన్ నారాయణన్ ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఈ ఏడాది చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతమైందని చెప్పారు. నావిగేషన్ శాటిలైట్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ వందో ప్రయోగం మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. "ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం పదేళ్ల పాటు సేవలందిస్తుంది. విక్రమ్ సారాబాయ్ హయాం నుంచి ఇస్రో విజయ పరంపర కొనసాగింది. ఇప్పటి వరకు 6 జనరేషన్ల లాంచ్ వెహికిల్స్ అభివృద్ధి చేశాం. 1979లో అబ్దుల్ కలాం నేతృత్వంలో తొలి లాంచ్ వెహికిల్ ప్రయోగం జరిగింది. ఇప్పటివరకు శ్రీహరికోట వేదికగా 100 ప్రయోగాలు జరిగాయి. 100 ప్రయోగాల్లో 548 శాటిలైట్లను కక్ష్యలోకి పంపాం. 3 చంద్రయాన్, మాస్ ఆర్బిటర్, ఆదిత్య, ఎస్ఆర్ఈ మిషన్లు చేపట్టాం." అని నారాయణన్ తెలిపారు. ఈ ప్రయోగంతో ఇస్రో 100 రాకెట్ ప్రయోగాలు పూర్తి చేసిన ఘనతను చాటుకుంది. ఇస్రో శ్రీహరికోట నుండి మొత్తం 548 ఉపగ్రహాలను నింగిలోకి పంపిందని, ఇందులో భారత్‌కు చెందిన మొత్తం ఉపగ్రహాలు 115 కాగా విదేశీ వాణిజ్య ఉపగ్రహాలు 433 ఉపగ్రహాలు ఉన్నాయన్నారు. కాగా భారత్‌కి చెందిన మరో 30 ఉపగ్రహాలను ఇస్రో బయటి దేశాల నుంచి ప్రయోగించారు. ఇస్రో మూడు గగన్ యాన్ ప్రయోగాలకు సిద్ధమవుతోందని, అందులో రెండు మానవరహిత ప్రయోగాలు కాగా ఒకటి మాత్రం మానవ సహిత ప్రయోగం ఉంటుందని నారాయణన్ తెలిపారు. షార్ నుండి జరిపిన వందవ రాకెట్ ప్రయోగం విజయవంతం దేశానికి గర్వకారణమని, చరిత్రాత్మకమైనదన్నారు. స్పేడెక్స్ ప్రయోగం ద్వారా డాకింగ్ పరిశోధనను విజయవంతంగా నిర్వహించి ప్రపంచంలో భారత్‌ను ఇస్రో నాలుగవ దేశంగా నిలిచిందన్నారు. మీడియా సమావేశంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, వీఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్నికృష్ణన్, మిషన్ డైరెక్టర్ తామార్ కురియన్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ మోహన్, యూఆర్ఎస్‌సి డైరెక్టర్ శంకరన్, ఎస్ఏసీ డైరెక్టర్ నీలేష్ దేశాయ్, స్పేస్ క్రాఫ్ట్ డైరెక్టర్ కార్తీక్, గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ, పీఆర్వో భాస్కరన్ పాల్గొన్నారు.

బీజేపీ దురాలోచన వీడాలి

(మొదటిపేజీ తరువాయి)

భిక్షపతి అధ్యక్షతన జరిగింది. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం... నక్సలైట్ల పేరుతో కమ్యూనిస్టులను అంతం చేయాలని చూస్తున్నదని, అది బీజేపీ వల్ల కాదని అన్నారు. నక్సలైట్లు తమ సహచర సోదరులేనని, వారిని చంపడం దుర్మార్గమైన చర్య అని, ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లు ఆపాలని డిమాండ్ చేశారు. మతతత్వ రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదని హెచ్చరించారు. దేశంలో అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులను అంతం చేయలేరన్న విషయాన్ని బీజేపీ గ్రహించాలన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూనే ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పూర్తి స్థాయిలో నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. మంచి పనులకు మద్దతు తెలుపుతూనే సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు, ధర్నాలు నిర్వహించడమే తమ బాధ్యత అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. పేదల కాలనీలలో మౌలిక వసతులు కల్పించే వరకూ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారందరికీ పట్టాలు ఇచ్చేంతవరకు అండగా ఉంటామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అందువల్లనే ప్రజలు మార్పు కోరుకున్నారని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి,పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మునగాల భిక్షపతి, బాషబోయిన సంతోశ్, ఉట్కూరి రాములు, నకీర్త ఓదెలు, మోతె లింగారెడ్డి, గోలి రాజిరెడ్డి, యేషబోయిన శ్రీనివాస్, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్ నాయక్, కామెర వెంకటరమణ, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి,ప్రణీత్ గౌడ్,వేల్పుల చరణ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ బ్రిటీష్ తొత్తులు

(మొదటిపేజీ తరువాయి)

దాడులకు పాల్పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పాలకుల్లో నియంతృత్వ ధోరణులు ప్రబలుతున్నాయన్నారు. సదస్సుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ దేశంలో 100 సంవత్సరాల చరిత్ర ఉన్న ఏకైక పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. సదస్సులో సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి అనీ రాజా, కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు, సీపీఐ నాయకులు, వామపక్ష అభిమానులు పాల్గొన్నారు.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణ ఫిబ్రవరి 13 చివరి తేదీగా నిర్ణయించారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే కోడ్ అమల్లోకి రానుంది. మార్చి 29వ తేదీతో ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియనుంది. ఏపీలో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకర్గాలకు, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. రెండు పట్టభద్రుల స్థానాలకు ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ అభ్యర్థులు బరిలో ఉండగా... ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానానికి పరోక్షంగా ఆ పార్టీ మద్దతిస్తోంది. పట్టభద్రుల రెండు స్థానాలకూ పీడీఎఫ్ పోటీ చేస్తోంది. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థుల్ని ఇంతవరకు ఖరారు చేయలేదు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సిట్టింగ్ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్) కొనసాగుతున్నారు. తిరిగి ఆయనే పోటీ చేస్తున్నారు. ఇదే స్థానానికి గతంలో రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన గాదె శ్రీనివాసులునాయుడు... పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యారు. యూటీఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి బరిలో ఉన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా డీవీ రాఘవులు పేరు ఖరారు చేశారు. అటు ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం పేరును ప్రకటించారు. ప్రస్తుతం అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఐ.వెంకటేశ్వరరావు(పీడీఎఫ్) కొనసాగుతుండగా... ఆయన స్థానంలో ఈ విడత పీడీఎఫ్ నుంచి డీవీ రాఘవులు పేరు ఖరారు చేశారు. వైసీపీ అభ్యర్థిని ఇంతవరకు ప్రకటించలేదు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి టీడీపీ తరపున మాజీ మంత్రి ఆలపాటి రాజా పేరు ఆ పార్టీ ఖరారు చేసింది. ఇక్కడ పీడీఎఫ్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తిరిగి పోటీ చేస్తున్నారు. మొదట్లో ఈ నియోజకవర్గానికి వైసీపీ తరపున పూనం గౌతమ్‌రెడ్డి పేరును ఖరారు చేయగా, కొద్ది రోజుల తర్వాత ఆయన పేరును విరమించుకుంది. అటు తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికల కోసం, వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూలు జారీ అయింది. ఆ రాష్ట్రంలో ఖాళీ కానున్న ఈ మూడు స్థానాలకు ప్రస్తుతం జీవన్ రెడ్డి, కూర రఘోత్తమ్ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మూడు స్థానాలకు బీజేపీ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా , అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్ పోటీ చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

కేజ్రీవాల్‌కు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో కేజ్రీవాల్‌కు హర్యానా కోర్టు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 17న కోర్టులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ రోజు విచారణకు హాజరు కాకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ సోనిపట్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు (సీజేఎం) నోటీసులు జారీ చేసింది.

లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు

(మొదటిపేజీ తరువాయి)

యారన్ డిపో ద్వారా ఆసాములకు మాత్రమే నూలు పంపిణీ చేయాలని ఆదేశించారు. నూలు స్టాకులను పెంచి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, సహకారశాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయండి

వామపక్ష నేతలు, మేధావుల డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: చత్తీస్‌గఢ్ రాష్ట్రం అబుజ్ ప్రాంతంలో కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష నేతలు, మేధావులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. "నక్సల్స్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం- ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం" అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం జరిగింది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో మాజీ ఎమ్మెల్యే ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్, వామపక్షాల నాయకులు డి.జి.నరసింహారావు (సీపీఐ- ఎం), చలపతిరావు (సీపీఐఎంఎల్ న్యూడెమక్రసీ), కె.మురహరి (ఎస్‌యుసీఐ), రమేశ్ (ఎంఎల్ లిబరేషన్), ప్రసాద్ (సీపీఐ ఎంఎల్), ప్రసాద్ (ఫార్వర్డ్ బ్లాక్), అనిల్ (ఎంసీపీఐ-యు) ప్రసంగించారు.ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రశ్నించడం సమాజానికి అవసరమని, ప్రశ్నించకపోతే ఆ సమాజం జీవచ్ఛవం వంటిదని, ఇది చరిత్ర నేర్పిన పాఠం అని అన్నారు. దేశంలో ఎవరు ప్రశ్నించిన అణచివేస్తున్నారని, నిర్బంధమైన వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు సంక్షోభంలో పడ్డాయని అన్నారు. బస్తర్ ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తామని, అడ్డొస్తే చెట్లు, మనుషులను కూడా తొలగిస్తామని చత్తీస్‌గఢ్ సీఎం మాట్లాడడం ఏమిటని నిలదీశారు. అడవిని ప్రేమించి రక్షించేవారిని ద్వేషించడం తగదన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... 2026 మార్చి నాటికి ఒక్క మావోయిస్టు కూడా లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను హోం మంత్రిని చేసింది ప్రజలను చంపేందుకేనా అని నిలదీశారు. అమిత్ షా దొంగలకే దొంగ అని, ప్రశ్నిస్తున్న వారిని చంపేస్తున్నారని మండిపడ్డారు. దొంగలకు ఆది దొంగ నరేంద్రమోదీ అని దుయ్యబట్టారు. కమ్యూనిస్టులు లేకపోతే ప్రశ్నించే వారు ఉండబోరన్నారు. మావోయిస్టుల తరపున ప్రశ్నిస్తామని, కేసులు నమోదు చేసినా తాము వెనుకాడబోమని హెచ్చరించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులు ఏకమై దేశంలో నెలకొన్న అణచివేతలను, దాడులను నిలువరించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఆలోచించాలని సూచించారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ భయమనేది ఇప్పుడు దేశంలో అధికారిక ఉద్వేగంగా మారిందన్నారు. ఆ భావోద్వేగమే ప్రజల మనుస్సుల్లో భయానకర వాతావరణం సృష్టిస్తోందన్నారు. సమాజం మౌనంగా ఉండడంతోనే నేడు పాలకులు ప్రశ్నించే గొంతికలను భౌతికంగా లేకుండా చేస్తున్నారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ ఎన్ జరిగిన ప్రతిసారి ఎదుటి పక్షం వారు మాత్రమే మరణించడమా దీనిని ప్రజలంతా ఆలోచించాలని కోరారు. వ్యక్తులను మాత్రమే చంపగలరే కాని కమ్యూనిజాన్ని అమిత్ షా వంటివాళ్ల వెయ్యిమంది వచ్చినా ఏమి చేయలేరని పేర్కొన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ తుపాకి పట్టుకున్న అన్నల వద్దకు పేదలు స్వేచ్ఛగా వెళ్తున్నట్టే... అదే తుపాకి పట్టుకున్న పోలీసుల వద్దకు వెళ్లగలిగే పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ పోరాటాల అవసరమే లేదని పేర్కొన్నారు. మావోయిస్టుల చర్యలను సమర్థించకపోయినా వారిపై జరుగుతున్న అమానుష ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పశ్యపద్మ మాట్లాడుతూ అబుజ్ మావోయిస్టులపై కేంద్ర పాలకులు కొనసాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపి వేయాలన్నారు. ప్రజా తీర్మానాలను చేసి ప్రజా ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరముందన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులకు శిక్షించాలని డిమాండ్ చేశారు. డి.జి. నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రశ్నించే గొంతుకలను అణిచి వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షా సాగిస్తున్న దమన కాండను అడ్డుకట్ట వేసేందుకు పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేసి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరముందన్నారు. కమ్యూనిస్టు ఐక్య ఉద్యమాలతోనే అడ్డుకట్ట... వామపక్ష నాయకులు చలపతి రావు, మురహారి, రమేశ్ రావు, ప్రసాద్, అనిల్ కుమార్ మాట్లాడుతూ మధ్య భారతంతో జరుగుతున్న హత్యాకాండకు అడ్డుకునేందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఐక్య ఉద్యమాలను చేపట్టాల్సి అవసరముందన్నారు. కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యం సమ సమాజ స్థాపనేనన్నారు.

దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో ముసాయిదా నివేదికను సమర్పిస్తామని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిబ్రవరి రెండో తేదీ లోగా కేబినెట్ సబ్ కమిటీకి తుది నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత నవంబరు ఆరో తేదీన రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మొదలైంది. డిసెంబరు మొదటి వారంలో పూర్తయింది. దాదాపు 1.16 కోట్ల కుటుంబాల నుంచి ఎన్యుమరేటర్లు వివరాలను సేకరించారు. అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి నాల్గో తేదీన సీఎం నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. 16వ తేదీన అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. సెప్టెంబరు 12వ తేదీన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది. అక్టోబరు 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,, రాజకీయ , కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. అక్టోబరు 10వ తేదీన జీవో 18 జారీ అయింది.

వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటా సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధమని గతంలో పంజాబ్-హర్యానా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని కొంతమంది సుప్రీంకోర్టులో సవాల్ చేయగా... ఇద్దరు సభ్యుల ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో తాజా తీర్పు వెలువడింది.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : నూతన సంవత్సరం 2025 విశాలాంధ్ర దినపత్రిక క్యాలెండర్, విశాలాంధ్ర డైరీని, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కలెక్టర్ ఛాంబర్లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగు డిపిఆర్ రఫిక్, కలెక్టరేటు పరిపాలన అధికారి, విశాలాంధ్ర ములుగు జిల్లా బ్యూరో యెంపెల్లి లకుమయ్య పాల్గొన్నారు.

సాటి మనిషిని బాధ్యతగా ఆదుకోవాలి : బాసిత్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సమాజంలోని సాటి మనిషిని బాధ్యతగా ఆదుకుంటే ఆ దైవం మనల్ని ఆదుకుంటాడని... ఈ సారాంశం అన్ని గ్రంథాల్లో ఉందని జమాతే ఇస్లామీ హింద్ బాధ్యులు, సామాజిక కార్యకర్త షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. దేవుడు మనకిచ్చిన దాంట్లో ఎంతో కొంత అవసరార్థులకు మనవీయ సాయం చేయడం వల్ల కలిగే మానసిక ఆనందం ఖరీదు కట్టలేనిదన్నారు. బూడిద గడ్డలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నెల రోజులకు సరిపడా బిస్కెట్లు, పండ్లు అల్పాహారంగా గౌరి శంకర్ కుటుంబ సభ్యులు సహకారంతో బాసిత్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో మంచి చెడుల విచక్షణ చూపే విద్యాదానం చాలా గొప్పది అన్నారు. సమాజంలో ఆర్థికంగా ఉన్న వారు పేద విద్యార్థుల చదువులకు అన్ని విధాలా సహకరించాలని ఆయన కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు మధుర వాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందచేసి వారి చదువుకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు భరత్ సందీప్, కాంతి రేఖ ఉపాధ్యాయులు దస్తగిరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : అశ్వరావుపేట నియోజకవర్గానికి చెందిన కొందరు అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బుధవారం ఒక్కొక్కరిని పరామర్శించారు. నియోజకవర్గంలో అనారోగ్య బాధితుల పట్ల ఎమ్మెల్యే జారే చాలా ఏళ్లుగా అనేక కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావలసిన సహాయ సహకారాలను అందిస్తుంటారని మంచి పేరు ఉంది. ఆయన ఎమ్మెల్యేగా గెలవక ముందు కూడా ఇలాంటి వైద్య సేవా కార్యక్రమాలు చాలా చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో యాలమూడి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుంటే నిమ్స్ లో చేర్పించారు. ఇతనికి అత్యవసర సర్జరీ కోసం రూ. లక్షా 30 వేలు అవుతుందని డాక్టర్లు వెల్లడించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎల్ వో సి మంజూరు చేయించి స్వయంగా వెళ్లి బాధిత కుటుంబానికి అందించారు. అనంతరం ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దమ్మపేట మండలం మొండివర్రె కు తగరం వెంకటేశ్వరరావును, వినాయకపురం గ్రామానికి చెందిన ఉప్పల చిట్టిబాబులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. నిమ్స్ డాక్టర్లను ఎమ్మెల్యే సంప్రదించి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. చికిత్స పొందుతున్న రోగుల కుటుంబాలు ఎమ్మెల్యే జారే సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

పేపర్ మిల్లులో ఎన్నికలు నిర్వహించాలి

విశాలాంధ్ర - కొమరం భీం : సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల వెరిఫికేషన్ ఎన్నికలు జరిపించాలని హైదరాబాద్లో జాయింట్ లేబర్ కమిషనర్కు వినతిపత్రం ఇచ్చారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఆ ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ కొమరం భీం జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్లోని సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపుకై ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్లే ప్రారంభించి తర్వాత నిలుపుదల చేశారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశణ రాజన్న. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు. మధు రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు వేధింపులు

ఎమ్మెల్యే పాయంకు ఫిర్యాదు

విశాలాంధ్ర - పినపాక : ఒంటరి మహిళను వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఉదంతం ఆలస్యంగా బయటపడింది. బాధిత మహిళ స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. తమ గ్రామ కార్యదర్శి పైశాచిక నైజాన్ని ఆ మహిళ వివరించడంతో పాటు విశాలాంధ్రకు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. పినపాక మండలంలోని భూపాలపట్నం కు చెందిన 32 ఏళ్ళ నిట్ట శిరీషను కొన్నాళ్ళుగా ఆ గ్రామ కార్యదర్శి లైంగికంగా వేధిస్తూ, వెంటపడుతున్నాడు. భర్తతో తీవ్ర వివాదాల కారణంగా ఆమె కొంతకాలం క్రితం విడాకులు తీసుకుంది. విడాకుల అనంతరం తన ఇద్దరు పిల్లలతో తల్లిదండ్రులను ఆశ్రయించి బతుకుతుంది. భూపాలపట్నంలో ఆమెకు ఖాళీ ఇంటి స్థలం ఉంది. పిల్లల పోషణార్థం ప్రస్తుతం మణుగూరులోని ఒక హోటల్లో పని చేస్తూ జీవిస్తుంది. తన పేదరిక నేపథ్యంలో సంక్షేమ పథకాలకు వస్తాయని ఆశించి దరఖాస్తు చేసుకుంది. పొరపాటు ఎక్కడ జరిగిందో కానీ ఈమెకు ఏ పథకం మంజూరు కాలేదు. ఈమె పరిస్థితి పట్ల ఎప్పటినుంచో కన్నేసిన కార్యదర్శి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. పథకాలు రాకపోవటానికి తానే కారణమని... పథకాలతో పాటు... అన్నీ తానై చూసుకుంటానని ఆమెను కార్యదర్శి లైంగికంగా వేధిస్తున్నట్లు శిరీష వెల్లడించింది. సెక్రటరీపై జిల్లా కలెక్టర్ విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అభ్యర్థించింది. దిక్కులేని పరిస్థితుల్లో ఉన్న ఆమెకు సంక్షేమ పథకాలు మంజూరు కాకపోవడం ప్రభుత్వ క్షేత్ర స్థాయి సర్వే విధాన లోపాలకు అద్దం పడుతుంది. ఈ విషయంపై వివరణ అడిగేందుకు కార్యదర్శిని విశాలాంధ్ర పలు మార్లు ఫోన్ చేయడం జరిగింది. ఎన్నిసార్లు చేసినా అతని ఫోన్ కవరేజ్ ఏరియాలో లేదని వస్తుంది.

అంధకారంలో కొండమల్లేపల్లి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణం నుండి దేవరకొండ రోడ్డుకు హైమాస్ట్ లైట్లు రాత్రి వేళలో పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో వాహనదారులకు శాపంగా మారింది దాదాపు నెల రోజుల నుండి వెలగకపోవడంతో రాత్రి వేళల్లో దేవరకొండ రోడ్డుకు వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు బిక్కుబిక్కుమంటున్నారు. నెల రోజుల క్రితం ఎమ్మార్వో ఆఫీస్ ముందల ఒక వ్యక్తి చనిపోగా నిత్యం ఏదో రకంగా మృత్యువాతపడుతున్నారు ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి ప్రమాదాలను అరికట్ట వలసిందిగా లైట్ల మరమ్మతులను వెంటనే చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అవసరమైన పల్స్ ఆక్సో మీటర్లు, సెల్ కౌంటర్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, హాలియా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది, హాజరైన వారు, గైర్హాజరైన వారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందరూ సకాలంలో పిహెచ్సికి రావాలని, ఒకవేళ ఏదైనా అత్యవసరపనిపై పీహెచ్సి కి రాలేకపోతే ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలతో పాటు, సాధారణ ప్రసవాలను పెంచాలని ఆమె సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హాలియా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి బాలిక విద్యాలయలో సౌకర్యాలను, కిచెన్ వంట సామాగ్రి సరుకులు, విద్యార్థుల చదువు, తదితర విషయాలను పరిశీలించారు. అంతేకాక విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కాగా కేజీబీవీ లో డైనింగ్ హాలు లేదని గమనించిన జిల్లా కలెక్టర్ విద్యార్థినిలకు ఇబ్బందులు కలగకుండా వారం రోజుల్లో డైనింగ్ హాల్ షెడ్ ఏర్పాటు చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు

మహిళలకు రాజకీయాధికారాన్ని కల్పించాలి : బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : దేశ జనాభాలో సగం భాగం ఉన్న మహిళలకు రాజకీయ అధికారం లేకుండా మహిళల సమస్యలు పరిష్కారం కావని, స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా రాజకీయ అధికారం అడుకోవడం సిగ్గుచేటని బాగం హేమంతరావు అన్నారు. మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్. ఐ. డబ్ల్యు) ఖమ్మం జిల్లా జనరల్బాడీ సమావేశం బుధవారం పోటు కళావతి అధ్యక్షతన ఖమ్మం గిరిప్రసాద్భవన్లో జరిగింది. ఈ సమావేశం ముఖ్యఅతిథిగా పాల్గొన్న సి.పి.ఐ జాతీయ సమితిసభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ రాజకీయపార్టీలకు ఎన్నికల సమయంలో ఓట్లకోసం మహిళలు గుర్తుకొస్తారు. కాని అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలను విస్మరిస్తున్నారన్నారు. మహిళా సాధికారితపై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. టీవీసీరియల్లలో మహిళలను విలన్గా చిత్రీకరించడం వలన ప్రజలలో చులకన భావన ఏర్పడుతుందని దీనిని అదుపు చేయాలని హేమంతరావు కోరారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి ఏపూరి లతాదేవి మాట్లాడుతూ దేశంలో పబ్బు, బహిరంగంగా డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా లభ్యమవడంతో వాటికి బానిసలైన యువత మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని నిత్యం ఏదో ఒక చోట అగత్యాలు జరుగుతున్నాయని అన్నారు. వాటిని నిర్మూలించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాన్నారు. సోషల్ మీడియాలో మహిళలను వ్యాపారవస్తువుగా ప్రచారానికి వాడుకుంటున్నారని వీటిని అరకట్టాలన్నారు. ముఖ్యంగా వెబ్సీర్స్ లో నియంత్రణ లేక పోవడంతో వాటిని చూసి హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. మహిళలరక్షణకోసం అనేక చట్టాలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేంద్రరక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. మహిళలకు ఉచితంగా కార్పోరేటు విద్యా, వైద్యం అందించాలని లతాదేవి కోరారు. రానున్న జిల్లా మహాసభలకు ముందుగా గ్రామశాఖల నిర్మాణం పటిష్టం చేసుకొని, గ్రామ, మండల మహాసభలు నిర్వహించాలన్నారు. ఈ జనరల్బాడీ సమావేశంలో సి.పి.ఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహిళ సమాఖ్య నిర్మాణ ఉ వసంఘం బాధ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, నాయకులు మందడపు రాణి, కన్నెబోయిన విజయమ్మ, కర్నాటి నళినీ, సోమెజుల సరోజనమ్మ, ఎస్.కె. రంజాబీ, మహ్మద్ జాస్మిన్, మేళ్ళచెరువు లలితా, దండి రాజేశ్వరీ, కళావతి, రాంబాయమ్మ, బందారు కుమారి, ఈశ్వరమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందించాలి

విశాలాంధ్ర - కారేపల్లి : కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా,రైతు భరోసా సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాలలో నిజమైన అర్హులకు మాత్రమే ఇవ్వాలని వీటి మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండరాదని సీపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కారేపల్లి కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు గుగులోతు తేజ నాయక్ ఎన్ వి రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ పిలుపు మేరకు మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ సంపత్ కుమార్కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతినిరుపేదలైన ప్రజలకు నివాసం ఉండుటకు ఇండ్లులేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అటువంటి వారికి సహాయం చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విధి విధానాలను పాటించడం లేదని ఫలితంగా అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్ లైన్ మండల నాయకులు బిక్కసాని భాస్కర్, వడ్డే వెంకటేశ్వర్లు, పులకాని సత్తిరెడ్డి,వేములపల్లి వీరన్న, చల్లా రాజు, తాటి పాపారావు, గుమ్మడి సరోజిని,రావుల నాగేశ్వరరావు, కనకరాజు, ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా, స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొనగా. రవాణా శాఖ అధికారులు కలెక్టర్ కు పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధంగా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిర్మల్ ను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 26 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణ చర్యలను చేపట్టడం ద్వారా 23 ప్రమాద రహిత ప్రదేశాలుగా మార్చినట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి కలెక్టర్, ఇతర అధికారులు కలిసి హెల్మెట్ లను అందజేశారు. జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పి జానకి షర్మిళ, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రారెడ్డి లు, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలి, ఆటో యునియన్ అధ్యక్షులు మల్లేష్, నిర్మల్ పట్టణ తహసిల్దార్ రాజు, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఎన్సీసీ విద్యార్థులు, డ్రైవర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఏడుపాయలలో భక్తుల పుణ్య స్నానాలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మాఘ అమావాస్య సందర్భంగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడు పాయల జన సంద్రంగా మారింది. మంజీరా నది ఉత్తర వాహినిగా ప్రవహించే ఏడుపాయలలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు తెల్లవారు జాము నుంచే ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వన దుర్గ (ఘనపూర్) ఆనకట్ట గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఏడుపాయలలోని మంజీరా నది పాయలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఘన పూర్ ఆనకట్ట దగ్గర, నదీపాయల వెంట ఏర్పాటు చేసిన షవర్ల దగ్గర భక్తులు స్నానాలు చేసి వనదుర్గా మాతను దర్శించుకుని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమావాస్య జాతర సందర్భంగా వన దుర్గా మాత ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే ఆలయ అర్చకులు శంకర్ శర్మ, పార్థీవ శర్మ పూజల అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈఓ చంద్రశేఖర్, సూర్య శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

రోజువారి మందులతో క్షయ నివారణ

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : రోజువారి మందులతో క్షయ వ్యాధిని మరింత సులభంగా తగ్గించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ వో జయ మనోరీ అన్నారు. బుధవారం హుజూర్ నగర్లోని గోవిందాపురంలో నిర్వహించిన నిక్షయ్ శివర్ కార్యక్రమంలో భాగంగా క్షయ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న రాత్రివేళలో జ్వరం, బరువు తగ్గటం, కళ్లెలో రక్త జీరలు కనపడినట్లయితే క్షయ వ్యాధిగా అనుమానించి వెంటనే పరీక్ష చేయించుకోవాలన్నారు. ఒకవేళ క్షయ వ్యాధి నిర్ధారణ అయినట్టయితే రోగికి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. చికిత్స కాలంలో రోగి పోషకాహార నిమిత్తం సొంత ఖర్చులతో నిక్షయ్ మిత్ర స్థానిక హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ 800 రూపాయల విలువ గల కిట్ ను చికిత్స పూర్తయ్యే వరకు అందించనున్నట్లు తెలిపారు. ఒక క్షయ రోగి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే సంవత్సరానికి ఆ ప్రాంతంలో 12 నుంచి 15 మందికి వ్యాధిని వ్యాప్తి చేసే అవకాశం ఉన్నందున ప్రజలు సమీప ఆశా కార్యకర్తలకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ప్రోగ్రాం అధికారి ఉమా, మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పద్మ, సుమిత్ర, కౌన్సిలర్ సౌజన్య, నూర్జహాన్, సూపర్ వైజర్ పద్మ, రమేష్,హెల్త్ అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, లక్ష్మి ,వరలక్ష్మి, వెంకన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ కృషితోనే అభివృద్ధి

విశాలాంధ్ర - (మహబూబాబాద్) మరిపెడ: డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ కృషితోనే గుండెపుడి గ్రామం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సూరబోయిన ఉప్పలయ్య అన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ దత్తత గ్రామం అయిన గుండెపుడిలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీసీ కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు అయిన రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఉప్పలయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి. ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇప్పటికే నాలుగు సీసీ రోడ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. మరో 15 రోజుల్లో మరో సీసీ రోడ్డును ప్రారంభించుకోనున్నట్లు ఉప్పలయ్య తెలిపారు. కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ గద్దం వెంకట్ రెడ్డి, దామోదర్రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాబు, పెద్దపులి శ్రీను, రేఖ శ్రీనివాస్, పులుసు మల్లేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేఖ ప్రవీణ్ కుమార్. నరేష్, ఏకస్వామి నాగేంద్రాచారి, మాధుచారి, సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, కందాల రమేష్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి పంప్స్ ఆర్థిక ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్: శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ డిసెంబర్ 31, 2024తో ముగిసిన త్రైమాసికం తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటిదార్, కంపెనీ పనితీరుపై మాట్లాడుతూ "మా కంపెనీ ప్రతిష్టాత్మకమైన "గ్రేట్ ప్లేస్ టు వర్క్" సర్టిఫికేషన్ను సంపాదించిందని పంచుకోవడానికి నేను సంతోషంగా ఉన్నానన్నారు. ఇది మా బలమైన, ప్రేరేపిత బృందానికి నిదర్శనమన్నారు. ఇది కంపెనీ స్థిరమైన వృద్ధికి దోహదపడిందన్నారు. ఆర్డర్ల అమలు కార్యాచరణ సామర్థ్యాల పెరుగుదల ద్వారా కంపెనీ బలమైన మొత్తం ఆర్థిక పనితీరును అందించిందన్నారు. దీని ఫలితంగా గణనీయమైన మార్జిన్ విస్తరణ కూడా జరిగిందన్నారు. మాగెల్ త్యాలా సౌర్ క్రుషి పంప్ పథకం వంటి పీఎం కుసుమ్ పథకం వెలుపల ఆర్డర్ల వైవిధ్యంతో, మేము మా వృద్ధి అవకాశాల గురించి నమ్మకంగా ఉన్నామన్నారు.

'నయంతా విశ్వవిద్యాలయం'లో ఆగస్టు నుంచి తరగతులు

హైదరాబాద్: మహారాష్ట్రలోని పూణెలో బావధన్ ప్రాంతంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'నయంతా విశ్వవిద్యాలయం' ప్రారంభమైంది. అడ్మిషన్లు ఫిబ్రవరి 2025లో జరగనున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. మహారాష్ట్ర స్టేట్ ప్రైవేట్ యూనివర్సిటీ చట్టం కింద నయంతా విశ్వవిద్యాలయం స్థాపించబడింది. ప్రపంచ స్థాయి విద్యా సంస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ విశ్వవిద్యాలయానికి నౌషాద్ ఫోర్బ్స్, క్రిస్ గోపాలకృష్ణన్, నాదిర్ గోద్రెజ్, మేహర్ పుదుమ్జీ, సతీష్ రెడ్డి వంటి ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు మద్దతు అందిస్తున్నారు.

ఏఎస్ఆర్టీయూ ఆధ్వర్యంలో 'డ్రైవర్స్ డే'

న్యూఢిల్లీ: 'డ్రైవర్స్ డే' పురస్కరించుకుని జనవరి 24నగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల సంఘం (ఏఎస్ఆర్టీయూ) భారతదేశం అంతటా డ్రైవర్లను గౌరవించే కార్యక్రమాన్ని ప్రకటించింది. సురక్షితమైన, నమ్మదగిన ప్రజా రవాణాను నిర్ధారించడంలో వారి అసాధారణ అంకితభావాన్ని గుర్తిస్తూ, భారతదేశంలోని ప్రతి ప్రభుత్వ బస్సు రవాణా సంస్థ నుండి ఇద్దరు ఆదర్శప్రాయమైన డ్రైవర్లకు ఏఎస్ఆర్టీయూ రూ.5,000 చొప్పున బహుమతి అందించనుంది. "ప్రజా రవాణా రంగంలో శ్రేష్ఠత, ప్రశంసల సంస్కృతిని ప్రేరేపించడం ఈ కార్యక్రమం లక్ష్యం" అని ఏఎస్ఆర్టీయూ ఉపాధ్యక్షులు ద్వారకా తిరుమలరావు అన్నారు. ఏఎస్ఆర్టీయూ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు, ఎస్పీవీలు నడుపుతున్న 1,50,000 కంటే ఎక్కువ బస్సులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. సమష్టిగా రోజుకు 70 మిలియన్లకు పైగా ప్రయాణికులకు సరసమైన, సురక్షితమైన రవాణాను అందిస్తుంది.

ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆర్థిక ఫలితాలు వెల్లడి

గురుగ్రామ్: భారతదేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ సప్లై చైన్, లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (టీసీఐ) తన మూడో త్రైమాసికానికి ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. డిసెంబర్ 31, 2024తో ముగిసిన మూడవ త్రైమాసికానికి ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్నట్లు ప్రకటించింది ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.11,539 మిలియన్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూను సాధించింది. గతేడాది ఇదే సమయంలో రూ.10,115 మిలియన్ల రెవెన్యూ సాధించింది. గతంలో పోలిస్తే... ఇప్పుడు ఇది 14.1% వృద్ధిని సూచిస్తుంది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు కంపెనీ ఆదాయాలు రూ.1,478 మిలియన్లకు చేరుకున్నాయి. ఇది క్యూ3/ఎఫ్వై2024లో రూ.1,276 మిలియన్ల నుండి 15.8% పెరుగుదల సాధించింది.

నేవీ అనుభవంతోనే అమెజాన్లో అగ్రస్థాయికి విక్టర్ జైస్

బెంగళూరు: అనుభవజ్ఞులు తమ నైపుణ్యాలను మరియు అనుభవాలను అమెజాన్లో ఎలా ఉపయోగించుకోగలరో దానికి ఒక ఉదాహరణ, లెఫ్టినెంట్ కమాండర్ విక్టర్ జైస్(రిటైర్డ్). 2008లో సేవలో చేరిన మాజీ భారత నావికాదళ అధికారి విక్టర్. సైన్యంలో పనిచేసిన తన తాతయ్య నుండి ప్రేరణ పొందిన విక్టర్ ఒక దశాబ్ద కాలంగా నేవీకి తన జీవితం అంకితం చేశారు. అక్కడ అతను పైరసీ నిరోధక కార్యకలాపాలకు విదేశ్ సేవా పతకం, నిబద్ధత, అంకితభావం కోసం 9 సంవత్సరాల సేవా పతకాన్ని పొందడంతో సహా అద్భుతమైన మైలురాళ్లను సాధించారు. నేవీ నుండి మారిన తర్వాత, ఏప్రిల్ 2022లో గ్లోబల్ థ్రెట్ ఎవాల్యుయేషన్ అండ్ రిస్క్ అసెస్మెంట్ బృందంలో సీనియర్ రిస్క్ మేనేజర్గా అమెజాన్లో చేరడానికి ముందు విలువైన కార్పొరేట్ అనుభవాన్ని విక్టర్ పొందారు. అమెజాన్లో మొదటి కొద్దిమంది ఉద్యోగులలో ఆయన ఒకరు. అమెజాన్ వేగవంతమైన, కస్టమర్-కేంద్రీకృత వాతావరణంలో రాణించడంలో అతని సైనిక నేపథ్యం కీలక పాత్ర పోషించింది. అమెజాన్ నాయకత్వ సూత్రాలు కేవలం మార్గదర్శకాలు కాదు - అవి ఒక జీవన విధానం. అవి సాధారణ కమ్యూనికేషన్ల నుండి వ్యూహాత్మక ప్రణాళిక వరకు ప్రతిదీ రూపొందిస్తాయి, అమెజాన్ సంస్కృతిని లోతుగా ప్రేరేపిస్తాయి అని విక్టర్ పంచుకున్నారు.

టాటా మోటార్స్ త్రైమాసిక ఫలితాలు విడుదల

ముంబై: టాటా మోటార్స్ లిమిటెడ్ (టీఎంఎల్) డిసెంబర్ 31, 2024తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. క్యూ3 ఎఫ్వై25కి, టీఎంఎల్ రూ.113.6 వేల కోట్లు (2.7%) ఆదాయాన్ని అందించింది. ఈబీఐటీడీఏ రూ.15.5వేల కోట్లు (13.7%, 60బీపీఎస్ తగ్గుదల), రూ.10.0వేల కోట్లు (8.9%, 60బీపీఎస్ పెరిగాయి). ఈబీఐటీ సరఫరా సవాళ్లు తగ్గడంతో క్యూ2 ఎఫ్వై25 కంటే బలమైన మెరుగుదల కనిపించింది. క్యూ3 క్యూ25కి పీబీటీ రూ.7.7 వేల కోట్లు, రూ.75 కోట్లు తగ్గుదల కన్పించింది. నికర లాభం రూ.5.6 వేల కోట్లు. వైటీడీ ఎఫ్వై25కి, వ్యాపారం రూ.22.3వేల కోట్లు బలమైన పీబీటీని నివేదించింది, ఇది మునుపటి సంవత్సరం కంటే రూ.2.8వేల కోట్లు మెరుగుదలను చూపిస్తుంది. క్యూ3 ఎఫ్వై25లో రికార్డు త్రైమాసిక ఆదాయంతో, దశాబ్దంలో అత్యధిక ఈబీఐటీ మార్జిన్, తొమ్మిదవ వరుస లాభదాయక త్రైమాసికంతో బలమైన పనితీరును అందించింది.

100% పర్యావరణ అనుకూల పాదరక్షల బ్రాండ్ 'గో ప్లానెట్-డి బై డెబోంగో'

ముంబయి: ప్రపంచంలోని మొట్టమొదటి 100% పర్యావరణ అనుకూల, వృత్తాకార పాదరక్షల బ్రాండ్గా 'గో ప్లానెట్-డి బై డెబోంగో' అవతరించింది. ప్రపంచంలోని మొట్టమొదటి 100% పర్యావరణ అనుకూల, వృత్తాకార పాదరక్షల బ్రాండ్గా ఎదగడం ప్రపంచ దృక్పథంలో నవీన భారతదేశం పునరుజ్జీవనాన్ని ప్రదర్శిస్తుంది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి, పాదరక్షల పరిశ్రమలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడానికి గో ప్లానెట్-డి బై డెబోంగో స్థిరమైన, వృత్తాకార వ్యాపార నమూనాను స్వీకరించింది. గో ప్లానెట్-డి బై డెబోంగో 100% రీసైకిల్ చేసి తిరిగి ఉపయోగించుకునే మొదటి పాదరక్షల బ్రాండ్ అవుతుంది. గో ప్లానెట్-డి బై డెబోంగో, రీసెల్. రీసైకిల్. రెన్యూ అనే కొత్త వ్యాపార మంత్రాన్ని అనుసరిస్తుంది. ప్రపంచంలోని మొట్టమొదటి 100% పర్యావరణ అనుకూల, వృత్తాకార పాదరక్షల బ్రాండ్, వినియోగించిన పాదరక్షలకు తిరిగి డబ్బు చెల్లించే మొదటి భారతీయ పాదరక్షల బ్రాండ్ అవుతుంది.

కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులలో మన విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు

హైదరాబాద్: కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్లోని ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూప్, భారతదేశంలో అత్యుత్తమ కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డుల విజేతలను ప్రకటించింది. నవంబర్ 2023, మార్చి, జూన్ 2024 కేంబ్రిడ్జ్ పరీక్షా సిరీస్లో భారతదేశంలోని సెకండరీ స్కూల్ లెర్నర్ల అత్యుత్తమ విద్యా విజయాలను ఈ అవార్డులు అద్దం పడుతున్నాయి. మొత్తం మీద, భారతదేశంలోని 228 మంది విద్యార్థులు విస్తృత శ్రేణి విషయాలలో కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, అంతర్జాతీయ ఏఎస్ అండ్ ఏ లెవల్ పరీక్షలలో అసాధారణ పనితీరును ప్రదర్శించి అవార్డులను అందుకున్నారు. ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో సత్కారాన్ని అందుకున్న విజేతలలో, ఒకే సబ్జెక్టులో ప్రపంచంలోనే అత్యధిక మార్కులు సాధించినందుకు 'టాప్ ఇన్ ది వరల్డ్' అవార్డులను గెలుచుకున్న 82 మంది విద్యార్థులు, ఒకే సబ్జెక్టులో భారతదేశంలో అత్యధిక మార్కులు సాధించిన 110 మంది విద్యార్థులు ఉన్నారు. భారతదేశంలోని విద్యార్థులు గణితం తరువాత ఆంగ్లంలో బాగా రాణిస్తున్నారని దక్కించుకున్న అవార్డులను పరిశీలిస్తే తేటతెల్లమవుతోంది.

కొత్త బీఎండబ్ల్యు ఎస్ 1000 ఆర్ఆర్ విడుదల

ముంబయి: కొత్త బీఎండబ్ల్యు ఎస్ 1000 ఆర్ఆర్ మోడలను ఆటో ఎక్స్పో 2025లో రెండవ రోజున భారతదేశంలో విడుదల చేశారు. అత్యంత ప్రజాదరణ పొందిన ఈ సూపర్ స్పోర్ట్ బైక్ పూర్తిగా బిల్ట్-అప్ యూనిట్గా దేశంలో అందుబాటులో ఉంటుంది. బుకింగ్లు బీఎండబ్ల్యు మోటోరాడ్ డీలర్ నెట్వర్క్ వ్యాప్తంగా ప్రారంభం కాగా, డెలివరీలు ఏప్రిల్ 2025 నుంచి ప్రారంభమవుతాయి. బీఎండబ్ల్యు గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పవా మాట్లాడుతూ, కొత్త బీఎండబ్ల్యు ఎస్ 1000 ఆర్ఆర్ అభివృద్ధి, విజయం కోసం దాని అగ్రస్థానాన్ని కాపాడుకునేందుకు అంతులేని కృషిని కొనసాగిస్తోందన్నారు. దీని ఎక్స్ షోరూమ్ ధర రూ. 21,10,000.

మారుతి వ్యాగన్ ఆర్ సీఎన్జీ వాహనాల విస్తరణ

హైదరాబాద్: రైడ్ హెయిలింగ్ కంపెనీలకు అధిక నాణ్యత గల కారు, డ్రైవర్లు, డ్రైవర్లు/ఫ్లీట్ ఆపరేటర్లకు వాహన యాజమాన్యాన్ని అందించే ఫ్లీట్ మేనేజ్మెంట్ కంపెనీ క్యూ ఫ్లీట్ , షేర్డ్ మొబిలిటీ రంగంలో ప్రముఖ వాహన నిర్వహణ సేవా ప్రదాత అయిన మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎంబిఎస్ఐ), బుధవారం హైదరాబాద్లో మారుతి వ్యాగన్ ఆర్ (సిఎన్జి) వాహనాల విస్తరణకు ప్రధాన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. భారతదేశంలో పట్టణ చలనశీలతను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తూ క్యూ ఫ్లీట్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకలో 51 వాహనాల మొదటి బ్యాచ్ను అధికారికంగా అందజేశారు.

డ్యూలింగో భాగస్వామ్యంతో 'డిటెర్మినేడ్ స్కాలర్షిప్'

హైదరాబాద్: సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (ఎస్టీఈఎం)విద్యలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా హైదరాబాద్ అశోక్ నగర్ చెందిన డ్యూలింగో ఇంగ్లీష్ టెస్ట్ (డీఈటీ) మాస్టర్ డిగ్రీ కోసం డిటెర్మినేడ్ స్కాలర్షిప్ను న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో డ్యూలింగో ఇంగ్లీష్ టెస్ట్ సీనియర్ డైరెక్టర్ క్యారీ వాంగ్ తో కలిసి డ్యూలింగో సీటీఓ, సహ వ్యవస్థాపకుడు సెవెరిన్ హాకర్ ప్రారంభించారు. నాలెడ్జ్ భాగస్వామిగా ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ఉండనుంది.

సంపాదకీయం

మహా శోకం

దేశంలో అతి పెద్ద మత కార్యక్రమం అయిన కుంభ మేళాలో 30 మంది మరణించారని ప్రభుత్వం తెలిపింది. మృతుల సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చునని ప్రభుత్వం వెల్లడించింది. కానీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మాత్రం బుధవారం సాయంత్రం దాకా మృతుల సంఖ్య ఎంతో చెప్పనే లేదు. వాస్తవాన్ని దాచడానికి సకల ప్రయత్నాలూ చేస్తోంది. మౌనీ అమావాస్య రోజున త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే పుణ్యం దక్కుతుందని కోట్లాదిమంది అలహాబాద్ చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తరవాత అక్కడ అనూహ్యంగా తొక్కిసలాట జరిగింది. మృతులు ఎంతమంది అన్నది నికరంగా తేలకపోయినప్పటికీ వారిలో ఎక్కువ మంది మహిళలేనంటున్నారు. కనీసం మరో వంద మంది గాయపడ్డారు. గంగ, యమున, సరస్వతి నదుల సంగమం అయిన చోట స్నానం ఆచరిస్తే పుణ్యం దక్కుతుందని నమ్మినవారు భారీ సంఖ్యలో కుంభ మేళాకు చేరుకున్నారు. సరస్వతి నది అయితే ఇంకి పోయింది. కానీ మూడు నదుల పవిత్ర సంగమాన్ని ప్రస్తావించేటప్పుడు గంగ, యమునతో పాటు సరస్వతి నదిని కూడా ప్రస్తావిస్తారు. తొక్కిసలాట జరిగిన చోట అంతా అల్లకల్లోల పరిస్థితి. ప్రాణాలు కాపాడుకోవడానికి జనం పరుగులు పెట్టడంవల్ల నది ఒడ్డున సేద తీరుతున్న వారు, నిద్రిస్తున్న వారు గాయాలపాలయ్యారు. తమవారి పరిస్థితి తెలుసుకోవడానికి భారీ సంఖ్యలో జనం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల దగ్గరకు చేరుకున్నారు. జనాన్ని అదుపు చేయడం కోసం పోలీసులు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. కష్ట కాలంలో ఎవరి ఆత్రుత వారిది. బుధవారం రోజు మౌని అమావాస్య కనక దాదాపు పది కోట్ల మంది ఇప్పటి దాకా కుంభమేళాలో పాల్గొనడానికి వచ్చారు. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది. ఈ నెల 13న కుంభమేళా ప్రారంభమైంది. ఇది మొత్తం ఆరు వారాలపాటు కొనసాగుతుంది. కుంభ మేళా నిర్వహణ కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 6,900 కోట్ల రూపాయలు కేటాయించింది. దాదాపు పదివేల ఎకరాల ప్రాంతంలో గూడారాలతో ఒక నగరమే ఏర్పాటు చేశారు. మూడువేల వంటశాలలూ వెలిశాయి. కార్లు నిలపడానికి వంద చోట్ల ఏర్పాట్లు జరిగాయి. విద్యుత్ సరఫరాకు భారీ ఏర్పాట్లే జరిగాయి. కుంభ మేళా రద్దీ తట్టుకోవడానికి వంద ప్రత్యేక రైళ్లు నడిపారు. కృత్రిమ మేధస్సును వినియోగించి భద్రతా ఏర్పాట్లూ జరిగాయి. డ్రోన్లూ తిరుగుతున్నాయి. వంద మీటర్ల లోతుకు వెళ్లగలిగిన డ్రోన్లూ ఉన్నాయి. యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిజం చెప్పడం లేదంటున్నారు. కార్లు నిలపడానికి వంద చోట్ల ఏర్పాట్లు జరిగాయి. విద్యుత్ సరఫరాకు భారీ ఏర్పాట్లే జరిగాయి. కుంభ మేళా రద్దీ తట్టుకోవడానికి వంద ప్రత్యేక రైళ్లు నడిపారు. కృత్రిమ మేధస్సును వినియోగించి భద్రతా ఏర్పాట్లూ జరిగాయి. డ్రోన్లూ తిరుగుతున్నాయి. వంద మీటర్ల లోతుకు వెళ్లగలిగిన డ్రోన్లూ ఉన్నాయి. కుంభమేళా సందర్భంగా గంగా స్నానం పవిత్రమైంది, పుణ్యం వస్తుంది అన్న నమ్మకం జనానికి ఉండవచ్చు. ఆ విశ్వాసాలను కాదనలేం. కానీ ప్రతి రోజూ కోట్ల సంఖ్యలో జనం గుమిగూడే చోట ఎలాంటి దుర్ఘటన జరగకుండా నివారించడానికి అవసరమైన ఏర్పాట్లు మాత్రం లేవని తొక్కిసలాటవల్ల రుజువైంది.

పవిత్రమైందిగా, శోభాయమానంగా జరగవలసిన కుంభమేళా మహా శోకాన్ని మిగల్చడానికి బాధ్యత కచ్చితంగా యోగీ ప్రభుత్వానిదే.

ఒకే సమయంలో ఒకే చోట ఒక్కో రోజు లక్షలాది మంది పోగవడాన్ని యోగి ప్రభుత్వం ఎందుకు అనుమతించిందన్న ప్రశ్న అడిగి తీరాల్సిందే. గంగానది ఒక్క అలహాబాద్ గుండానే ప్రవహించదు. ఇతర చోట్ల స్నానం చేసినా పుణ్యమే దక్కుతుంది అని ప్రభుత్వం ప్రజలకు నచ్చచెప్పలేక పోయింది. కొంతమందిని కాన్పూర్ లాంటి చోటికి పంపించవచ్చునన్న ఆలోచన యోగీకి తట్టనే లేదు. లక్షలు, కోట్ల మంది ఒకే చోట గుమిగూడినప్పుడు భద్రత కల్పించడం అసాధ్యం అన్న ఆలోచనా యు.పి.ప్రభుత్వానికి రాలేదు. అలాంటప్పుడు సైన్యం సహాయం ఎందుకు తీసుకోలేదు. ప్రతి ఉత్సవాన్ని ఒక మహాద్భుత సంఘటనగా చిత్రించేందుకు యోగీ ప్రభుత్వం మాత్రమే కాదు, బీజేపీ కూడా ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. ప్రముఖులకు ప్రాధాన్యం ఇవ్వడానికి ఎక్కడలేని శ్రద్ధ చూపించినందువల్లే ఈ దుర్ఘటన జరిగిందంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గంగా నదిలో మునక వేయడాన్ని ప్రభుత్వం మహత్తరమైన సంఘటనగా నిరూపించడానికి తాపత్రయ పడింది. ప్రముఖులకోసం ఏర్పాట్లలో పాలనా రంగం తీరిక లేకుండా పనిచేయడం మానేసి జనం కోసం తగిన చర్య తీసుకుని ఉంటే ఇంత ఘోరం జరిగేదే కాదు. గోదీ మీడియా సైతం ప్రచార పనిలో నిమగ్నమై పోయింది. లక్షలాదిగా వస్తున్న ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పవిత్ర స్నానాలకోసం చేసిన ఏర్పాట్ల గురించి తెలియజేయడానికి గోదీ మీడియా ఏ ప్రయత్నమూ చేసినట్టు కనిపించలేదు. ఇంత జరిగినా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ సంతాపమైనా వ్యక్తం చేయకపోవడం దుర్మార్గం కిందే లెక్క. ఈ సమయంలో కూడా ఆయన హిందూ-ముస్లిం జపమే చేస్తున్నారు. ప్రముఖుల కోసం ప్రత్యేక వంతెన నిర్మించిన, రోడ్లు నిర్మించిన యోగీ ప్రభుత్వం ప్రజలను మాత్రం గాలికి వదిలేసింది. ఆ ఏర్పాట్లన్నీ కేవలం ప్రముఖుల కోసమే. ప్రముఖులకే ప్రాధాన్యం ఇచ్చినందువల్ల సామాన్యులు ఎక్కడ స్నానం చేయాలో తెలియక అనేక చోట్లకు పిచ్చివాళ్లలా తిరగవలసి వచ్చింది. జనం మైళ్ల దూరం నడిచివచ్చినా స్నానఘట్టాలు చేరుకోవడానికి వీలులేకుండా చేశారు. సకలం ప్రముఖుల కోసమే. ఎక్కడ చూసినా బారికేడ్లే కనిపించాయి. ప్రముఖుల (వి.ఐ.పి.) అట్టహాసమైన ఏర్పాట్లు ఉండకూడదని, వారి వాహనాలకు ఎర్ర బుగ్గలు ఉండకూడదని మోదీ స్వయంగా చెప్పారు. ఎర్రబుగ్గలు లేకపోయినా ప్రముఖుల కోసం ఏర్పాట్లలోనే కింది నుంచి పై దాకా అధికారగణం అంతా నిమగ్నమై ఉంటుంది. ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఏమీ ఉండవని ప్రకటించారు. కానీ ఉన్నవల్లా అవే. ప్రముఖులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చినందువల్ల ఆగ్రహోదగ్రులైన జనం మేం జైలుకైనా వెళ్తాం అనాల్సి వచ్చింది. ప్రత్యేకంగా నిర్మించిన వంతెనలన్నీ ప్రముఖులకోసమే కేటాయించారు. ప్రముఖులందరినీ ఒకే రోజు స్నానం చేయడానికి అనుమతించినా ఇంత విపత్తు ఎదురయ్యేది కాదేమో. ఆ రోజు ఇతర భక్తులకు ప్రవేశం లేదన్నా జనం భరించే వారు. ఆరోజు దక్కించికోవాలనుకున్న పుణ్యాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసుకునేవారు. ప్రముఖుల కోసం ఏర్పాట్లు భక్తులకు శాపంగా పరిణమించాయి. 6900 కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం ఈ మేళా ద్వారా 25 వేల కోట్లు సంపాదిస్తోంది. అంటే ప్రభుత్వం ఖర్చు పెట్టింది ఏర్పాట్ల కోసం కాదు. లాభార్జన కోసం. ఇంతకన్నా దిగజారుడు ఎక్కడుంటుంది?

వామపక్ష ప్రభుత్వాలపై ట్రంప్ దాడి

డా. అరుణ్‌మిత్ర

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత అనేక అంశాలపైన ఎంతో ఆర్భాటంగా మాట్లాడాడు. జనవరి 20న అధికారం చేపట్టిన తర్వాత మరింతగా రెచ్చిపోయాడు. ప్రపంచాన్ని ఊబిలోకి నెట్టే విధంగా ఆయన చర్యలున్నాయని అనేకమంది విశ్లేషకులు వ్యాఖ్యానించారు. అమెరికాను గొప్పదేశంగా తయారు చేస్తానన్నారు. ఎప్పుడు కమ్యూనిస్టులను, వామపక్షాలను వ్యతిరేకించే ట్రంప్ ఇప్పుడు లాటిన్ అమెరికాలో వామపక్ష దేశాలపై దాడి ప్రారంభించాడు. లాటిన్ అమెరికాలో మితవాద దేశాలను బలోపేతం చేయడంకోసం, వామపక్ష దేశాలను బలహీనపరిచేందుకు పూనుకున్నాడు. అధికారం చేపట్టిన ఎనిమిది రోజుల్లోనే క్యూబా, మెక్సికో, కొలంబియాలపైన మూడు పాలనాపరమైన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇతర వామపక్ష ప్రభుత్వాలు వెనిజుల, బొలీవియా, హెూండురస్ అమెరికా నుంచి దాడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. దిగిపోయిన జో బైడెన్ తన పదవి చివరి రోజుల్లో క్యూబాను టెర్రరిస్టు రాజ్యాల జాబితా నుంచి తొలగించారు. స్వాగతించవలసిన చర్య ఇది. దీనివల్ల, అమెరికా నుంచి కొన్ని సౌకర్యాలు క్యూబాకు లభించే అవకాశం ఉంది. అమెరికా క్యూబా విధించిన ఆర్థిక దిగ్బంధం తొలగించినందున ప్రయోజనం కలుగుతుందనుకున్న క్యూబా ఆశలు నీరుగారిపోయాయి.

వామపక్షపాలన ఉన్న గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికా అని మార్చి వేశాడు. ఇది జరిగిన వెంటనే గూగుల్ కొత్తమాప్‌లను తయారుచేసి ప్రసారం చేస్తున్నారు. ట్రంప్ ఏకపక్ష చర్యలమీద అంతర్జాతీయ ఏజన్సీలు ఐక్యరాజ్యసమితిలో మెక్సికో సవాలుచేసి పోరాడే హక్కులున్నాయి. ఇంతకంటే మరింత కఠినమైన చర్య తీసుకున్నాడు. మెక్సికో అమెరికాకుచేసే ఎగుమతుల మీద 25శాతం టారిఫ్ విధించాడు. అలాగే అనుమతిలేని మెక్సికో ప్రజలు పెద్దసంఖ్యలో అమెరికాలో ఉన్నారు. వీరందరినీ వెనక్కుపంపడం ఇప్పటికే ప్రారంభమైంది.

అనుమతిపత్రాలులేని కొలంబియాలో వామపక్ష ప్రభుత్వం గత ఎన్నికల్లో విజయం సాధించింది. అంతవరకు మెక్సికో అమెరికా సంరక్షణలో ఉంది. అధ్యక్షుడు గుస్తావ్ పెట్రో ప్రభుత్వరంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆర్థిక రంగంలాంటి కీలకరంగాలలో బహుళజాతి కంపెనీల కార్యకలాపాలపైన ఆంక్షలు పెట్టారు గుస్తావ్. కొలంబియాకు చెందిన కార్మికులు, ఇతర ప్రజలు అమెరికాలో ఉన్నారు. వీరంతా నేరస్థులని కొలంబియాకు తిరిగి ట్రంప్ పంపగా గుస్తావ్ మొదట వ్యతిరేకంఇ, అనంతరం అంగీకరించారు. టారిఫ్‌ల పెంపు, వీసా ఆంక్షలు ట్రంప్ విధించిన తర్వాత వాణిజ్య పోరాటాన్ని కొలంబియా విరమించింది. అమెరికాలో దిగుమతులపైన అధ్యక్షుడు గుస్తావ్ టారిఫ్‌లు ప్రతీకారంగా విధించారు. అంతిమంగా అమెరికా నుంచి వెనక్కిపంపిన వారిని తీసుకుని ఘర్షణను విరమించుకున్నారు.

రవాణా నిషేధంతోపాటు తక్షణం వీసాలను రద్దుచేస్తానని తదుపరి వీసాలపై ఆంక్షలు విధిస్తానని అలాగే, అధికారుల కుటుంబసభ్యులపైన, వారి మద్దతుదారులపైన కూడా రవాణా ఆంక్షలు విధిస్తానని ట్రంప్ బెదిరించారు. ఈ చర్యలన్నీ ప్రారంభమేనని ట్రంప్ అన్నారు. కొలంబియా అధ్యక్షుడు పెట్రో వెంటనే స్పందిస్తూ, తాము కూడా తిరిగి అమెరికాపైన తగినచర్యలు తీసుకుంటామన్నారు. అమెరికాలో నివసిస్తున్న ఆల్ సైమన్, వాల్ట్ విట్‌మన్, నోమ్‌చామ్‌స్కీ తనకుఎంతో ప్రేమపాత్రులని పెట్రో అన్నారు. అమెరికా తమతో పెద్ద వాణిజ్య భాగస్వామి అని కూడా తెలిపారు. 2022లో అమెరికా కొలంబియాకు 28.7 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతిచేయగా, కొలంబియా అమెరికాకు 24.8బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసినట్లు తెలిపారు. అమెరికా, కొలంబియా ద్వైపాక్షిక వాణిజ్యం విస్తృతమైందని పెట్రో అన్నారు. కొలంబియా నుంచి అమెరికా క్రూడ్‌ఆయిల్, కాఫీ గింజలు, పూలు, బంగారం దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. కొలంబియా అమెరికా నుంచి గ్యాసోలిన్, మొక్కజొన్న, సోయాబీన్స్ దిగుమతి చేసుకుంటోంది. లాటిన్ అమెరికా దేశాలనుంచి అమెరికాకు అనుమతిపత్రాలులేని దాదాపు 11నుంచి 14 మిలియన్ల ప్రజలు వలసవచ్చారు. అమెరికా బ్రెజిల్‌కు చెందిన వలసవాదులను అవమానకరంగా చేతులకు సంకెళ్లువేసి పంపారని అ దేశ అధ్యక్షుడు లూలా డిసిల్వా తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ పదవీ స్వీకారోత్సవానికి బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బొల్సొనరో ప్రస్తుత అధ్యక్షుడైన లూలా పైన పోటీచేసి ఓడిపోయారు. ట్రంప్ అమెరికాకు ఆహ్వానించాడు. దేశ రాజకీయాలలో కీలకంగాఉన్న బొల్సొనారో ట్రంప్‌కు సన్నిహితుడు. లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తులు అధికారంలో ఉన్న ఇతరదేశాలు ఈక్వెడార్, బొలీవియా, చిలీ, హెూండురస్ దేశాలలో 2025లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అర్జంటైనాలో కేవలం జాతీయ అసెంబ్లీ ఎన్నికలే జరుగుతాయి. పై నాలుగు దేశాలలో అధికారంలో ఉన్న పాలకులపై ప్రజలలో కొంత వ్యతిరేకత ఉన్నది. అందువల్ల ఈ దేశాలలో వామపక్షాలు కఠిన పరీక్షను ఎదుర్కోనున్నాయి. ఇక్కడ వామపక్షాలకు వ్యతిరేకంగా ఎన్నికలలో పోటీచేయనున్న శక్తులకు ట్రంప్ ప్రభుత్వం అన్ని విధాలుగా సంపూర్ణ మద్దతు తెలియజేయనున్నది.

శత ప్రయోగాల వేదిక శ్రీహరికోట

జనక మోహన రావు దుంగ

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి జనవరి 29న తన 'వందవ' ప్రయోగం జీఎస్ఎల్వి - ఎఫ్15 ద్వారా ఎన్విఎస్ - 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగిలోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరివారంలో స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా ప్రయోగించిన పిఎస్ఎల్విసి - 60 షార్ నుంచి చేసిన 99వ ప్రయోగం. తొలి ప్రయోగంచేసిన 46 ఏళ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఇది ప్రతీ భారతీయుని విజయం. ఈ సందర్భంగా ఒకసారి మన అంతరిక్ష విజయ పరంపరను పునరావలోకనం చేసుకుందాం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే దేశ రక్షణ అవసరాలు, అభివృద్ధికి అంతరిక్ష పరిజ్ఞాన అవసరాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనా వ్యవస్థను ఏర్పరచేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడయిన విక్రం సారాభాయ్ 1957లో రష్యా మొట్టమొదటి ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించిన తరువాత మనదేశానికి కూడా ఉపగ్రహ అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు తెలియజేసి 'సాంకేతిక' పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చేటప్పుడే మన దేశంలోని ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చని ఒప్పించి, 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఇన్‌కోస్పార్)ను ఏర్పరచారు. భవిష్యత్తులో ఇతర దేశాలు ఉపగ్రహానికి కావలిసిన సకల పరికరాలను అందించక పోవచ్చని ముందుగానే ఊహించిన సారాభాయ్ అవసరమయిన అన్ని భాగాలనూ దేశీయంగానే తయారు చేసే దిశగా ప్రయత్నం చేశారు. 1969లో ఇన్‌కోస్పార్ ఇస్రోగా రూపొందింది. ఉపగ్రహాలను తయారు చేయడంతోపాటు వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎల్వి) ఉపగ్రహ వాహకనౌక రూపకల్పనకు నాంది పలికారు.

మొదటి నుంచి ఉపగ్రహాల నిర్మాణాన్నే దృష్టిలో పెట్టుకొని దానికి అవసరమయిన భూ ఉపరితల లక్షణాలను అధ్యయనం చేసేందుకు కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. కానీ దీని చుట్టూ జనసంచారం ఎక్కువగా ఉండడం, పైగా ఆ కేంద్రం మినీ రాకెట్ ప్రయోగాలకే పరిమితం కావడం కారణాన్న భవిష్యత్తులో చేయబోయే భారీ రాకెట్ ప్రయోగాల దృష్ట్యా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం మరోచోట రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అనువైన రాకెట్ ప్రయోగ కేంద్ర స్థలం కోసం అన్వేషణలో అన్ని ప్రాంతాలనూ పరిశీలిస్తూ రాగా శ్రీహరికోట దీవి ఆయన కంటపడింది.

షార్ నుంచి ఇస్రో జరిపిన 99 ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యాయి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433 విదేశీ ఉప గ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18 స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008 లో చంద్రయాన్1 , 2014 లో మంగళ్‌యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష,

శ్రీహరికోట ప్రత్యేకత:

రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు ఎంత దగ్గరగా ఉంటే భూమ్యాకర్షణను అధిగమించి పైకి వెళ్ళేందుకు రాకెట్‌కు అంత తక్కువ ఇంధనం ఖర్చౌతుంది. శ్రీహరికోట భూమధ్యరేఖకు దగ్గరగా ఉండడం ఇస్రో ఈ స్థలాన్ని ఎంచుకోవడానికి ఒక కారణం. భౌగోళికంగా సాంకేతికంగా, ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న ఫ్రెంచి గయానాలోని కౌరు రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు కేవలం ఏడు డిగ్రీల అక్షాంశంలోనూ, ఎంతో గొప్పదిగా చెప్పుకునే అమెరికాలోని కేఫ్ కెన్నెడీ రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు 28 డిగ్రీల అక్షాంశంలోనూ ఉండగా శ్రీహరికోట 13 డిగ్రీల 43 సెకండ్ల అక్షాంశం మీద ఉంది. భూమధ్య రేఖకు అత్యంత దగ్గరగా ఉన్న కేంద్రాల్లో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఇంకా రాకెట్ ప్రయోగ దిశలో భూభాగాలేవీ లేకపోవడం, ఒకవేళ ప్రయోగమేదైనా విఫలమైనా రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోయేందుకు వీలుండడం లాంటి కారణాలు కూడా కలిసి రావడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 1969 లో శ్రీహరికోట రాకెట్ కేంద్రంగా ఎంపికయింది. ఇక్కడ నుంచి 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని ప్రయోగించింది. కానీ ఈ ప్రయోగం సఫలం కాలేదు. షార్ నుంచి ఇస్రో జరిపిన 99 ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యాయి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433 విదేశీ ఉప గ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18 స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008 లో చంద్రయాన్1 , 2014 లో మంగళ్‌యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచ రికార్డు, 2017లో జిఎస్ఎల్‌వి మార్క్ 3 ప్రయోగం, 2023లో చంద్రయాన్- 3 విజయవంతం అయ్యాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తిమంతమైన క్రయోజెనిక్ ఇంజను కూడా విజయవంతమైంది.

ఎన్విఎస్ - 02:

నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్విఎస్) అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది మనదేశంలోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి ఖచ్చితమైన స్థానం, వేగం, సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించారు. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్పీఎస్), రెండు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). ఎస్పీఎస్ 20 మీటర్ల కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని, సేవా ప్రాంతంలో 40 నానో సెకెన్ కంటే మెరుగైన సమయ ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. రెండో తరం ఉపగ్రహాల్లో మొదటిదైన ఎన్వీఎస్-01ను 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 ద్వారా ప్రయోగించారు. తొలిసారిగా ఎన్వీఎస్-01లో స్వదేశీ అణు గడియారాన్ని ప్రయోగించారు. ఎన్వీఎస్ సిరీస్లోని రెండో ఉపగ్రహం ఎన్విఎస్-02ను ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్తో కాన్ఫిగర్ చేయడంతో పాటు సీ-బ్యాండ్లోని పేలోడ్ను దాని మునుపటి ఎన్వీఎస్-01 మాదిరిగానే రూపొందించారు. ఇది 2250 కిలోల లిఫ్ట్-ఆఫ్ ద్రవ్యరాశి, 3 కిలోవాట్ల పవర్ హ్యాండ్లింగ్ సామర్థ్యంతో స్టాండర్డ్ -ఐ 2కె బస్ ప్లాట్ఫామ్ పై కాన్ఫిగర్ చేయబడింది. ఐఆర్ ఎన్ఎస్ఎస్ -1ఈ స్థానంలో 111.75 డిగ్రీల ఉష్ణోగ్రతను అమర్చనున్నారు. ఎన్వీఎస్-02 ఖచ్చితమైన సమయ అంచనా కోసం స్వదేశీ, సేకరించిన పరమాణు గడియారాల కలయికను ఉపయోగిస్తుంది. ఎన్విఎస్-02 ఉపగ్రహాన్ని ఇతర ఉపగ్రహ ఆధారిత వర్క్ సెంటర్ల సహకారంతో యుఆర్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి) లో రూపొందించి అభివృద్ధి చేసి, ఇంటిగ్రేట్ చేశారు. ఉపగ్రహం వివిధ దశల్లో దాని పనితీరు సమ్మతి సమగ్ర ప్రీ-షిప్‌మెంట్ సమీక్ష డిసెంబర్ 27, 2024న పూర్తయింది. ఈ ఉపగ్రహాన్ని 2025 జనవరి 05న భారత ప్రయోగ కేంద్రం ఎస్డీఎస్సీ-షార్కు పంపారు. ఇది విజయవంతం అయింది.

సెల్: 8247045230

సాయుధ పోరాట సేనానులు - 2

ఆర్వీ రామారావ్

వర్గ స్వభావం అన్ని వర్గాలవారికీ ఉండొచ్చు. కానీ సంపన్న వర్గాలకు చెందిన కుటుంబాల నుంచి వచ్చినా తమ వర్గ స్వభావాన్ని విడనాడి పీడితుల పక్షాన నిలబడ్డ వారూ ఉంటారు. తన వర్గ స్వభావాన్ని వదులుకుని రావి నారాయణరెడ్డితో కలిసి సాయుధ పోరాటంలో పాల్గొన్న త్యాగశీలి బద్దం ఎల్లారెడ్డి.

మార్క్సిజం అధ్యయనం చేసిన పండిత్ నెహ్రూ అమలు చేసిన సోషలిజం ఏ పాటిది అన్న ప్రశ్న ఉండొచ్చు. కానీ ఆయన సోషలిస్టు భావాల ప్రభావం చాలా మంది మీద ఉంది. బద్దం ఎలారెడ్డి అలాంటి ప్రభావానికి లోనైనందువల్లే కమ్యూనిస్టు పార్టీలో అగ్రశ్రేణి నాయకుడయ్యారు. అయితే ఆయన నెహ్రూ ప్రభావాన్ని దాటి చాలా ముందుకు వెళ్లిపోయారు. ప్రాణాలకు లెక్క చేయకుండా ప్రజా పోరాటాల్లో లీనమైపోయారు. 1930-1940 లలో భూస్వామ్య కుటుంబాలలో పుట్టినవారు చాలామంది తమ వర్గ స్వభావాన్ని వదిలేసి ప్రజల పక్షాన నిలబడి విప్లవ కార్యాచరణకు అంకితమయ్యారు. బద్దం ఎల్లారెడ్డి సరిగా ఆ కోవలోని వారే.

1930 ల ఆరంభంలోనే నిజాం ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ కమ్యూనిజం వైపు ఆకర్షితులైన వారు అనేకమంది కనిపిస్తారు. ఆనాటి పరిస్థితుల కారణంగా వీరు మొదట కాంగ్రెస్‌లో ఉండి ఉండొచ్చు. లేదా ఆర్యసమాజం ప్రభావం వీరి మీద ఉండొచ్చు.

1938 లో రావి నారాయణరెడ్డితో కలిసి కాకినాడ వెళ్లి సత్యాగ్రహం చేసి ఏడు నెలలు జైలు పాలైన వారు బద్దం ఎల్లా రెడ్డి. విద్యార్థి దశలోనే ఆయనలో సమరశీల భావాలు ఉండేవి. సాయుధ పోరాట కాలంలో అరెస్టయి మూడేళ్లు జైలులో ఉన్నారు. 1939 లో హైదరాబాద్ సంస్థానంలో సీపీఐ కార్యకలాపాలు ప్రారంభించినప్పుడు బద్దం ఎల్లారెడ్డి అందులో చురుకుగా పాల్గొన్నారు. అంధ్ర మహాసభలో చురుకుగా పాల్గొన్నారు. ఒకసారి ఆంధ్ర మహాసభ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆంధ్ర మహాసభను సచేతనంగా మార్చి వామపక్ష భావాలు నింపిన వారిలో ఆయనది ప్రధానమైన పాత్ర.

1941 నుంచి ఆంధ్రమహాసభలో కమ్యూనిస్టు భావాలు

గల వారి ప్రాబల్యం ఉన్నవారి ఆధిపత్యం పెరిగింది. కమ్యూనిస్టు భావాలు ఉన్న వారివల్లే ఆంధ్ర మహాసభ పోరాట పటిమగల సంస్థగా మారి సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీతో బుజం బుజం కలిపి నడవగలిగింది. తెలంగాణాలో పౌర హక్కుల కోసం పోరాడిన తొలిదశ నాయకుల్లో ఎల్లా రెడ్డి పాత్ర అద్వితీయమైంది. సాయుధ పోరాటానికి పిలుపు ఇస్తూ విడుదల చేసిన ప్రకటనలో సంతకం చేసిన వారిలో ఎల్లారెడ్డి కూడా ఉన్నారు. మిగతా ఇద్దరు రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్. నిజాం పాలనను అంతమొందించి భారత యూనియన్లో విలీనం చేయడం కోసం విడుదలైన ప్రకటనపై కూడా ఆయన సంతకం చేశారు. తొలి లోకసభ ఎన్నికలలో బద్దం ఎల్లారెడ్డి కరీంనగర్ నుంచి ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (పి.డి.ఎఫ్.) అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉన్నందువల్ల అప్పుడు కమ్యూనిస్టులు పి.డి.ఎఫ్. పేరుతో పోటీ చేశారు. మొదటి ఎన్నికలలో బద్దం ఎల్లారెడ్డి పివీ నరసింహారావును ఓడించారు. 1958 లో బుగ్గారం శాసనసభా నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆంధ్ర మహాసభ ఘర్షణ లేని విధానం అనుసరించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

1964 లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినప్పుడు ఆయన ముందు సీపీఎంలో చేరారు. అయితే మూడు నెలల్లోనే మళ్లీ సీపీఐలో చేరారు. 1964 నుంచి 1970 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1972 ఎన్నికలలో కరీంనగర్ జిల్లా ఇందుర్తి నుంచి శాసనసభ్యుడయ్యారు. పేదలపై భూస్వాములు రుణభారం మోపడం సహించలేక ఆ రుణ పత్రాలన్నింటినీ బహిరంగంగా కాల్చేసి తన ధిక్కార స్వభావాన్ని చాటుకున్నారు. కడదాకా కమ్యూనిస్టు బాట వీడని అగ్నికణం బద్దం ఎల్లారెడ్డి.

దిల్లీలో కులగణన

- మహిళలకు నెలకు రూ.2,500
- 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం
- కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. తూర్పు ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసింది. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయాన్ని అందిస్తామని తెలిపింది. ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500కే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను ప్రజలకు కల్పిస్తామని పేర్కొంది కాంగ్రెస్. ఉచిత రేషన్ కిట్లను ప్రతినెలా ప్రజలకు పంపిణీ చేస్తామని తెలిపింది. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు ప్రతినెలా రూ.8,500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. దిల్లీ మహానగరం పరిధిలో 100 ఇందిర క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. వాటి ద్వారా కేవలం రూ.5కే భోజనం అందిస్తామని హామీ ఇచ్చింది. దిల్లీలో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను రద్దు చేసి, ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగాల్లో ఉన్న వారందరి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ ప్రకటించిన మరికొన్ని హామీల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. వృద్ధుల నెలవారీ ప్రభుత్వ పింఛను రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంపు , వితంతువుల కుమార్తెల వివాహాలకు రూ.1.1 లక్షల ఆర్థిక సాయం, దిల్లీలో వీధి వ్యాపారాలు చేసుకునే 7.5 లక్షల మందికి మరింత మెరుగైన అవకాశాల కల్పన, దిల్లీలోని ప్రతీ వార్డులో 24 గంటలూ అందుబాటులో ఉండేలా వైద్య డిస్పెన్సరీల ఏర్పాటు, విద్యార్థుల కోసం దిల్లీలో 700 ప్రజా గ్రంథాలయాల ఏర్పాటు వంటివి ఉన్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ బుధవారం మేనిఫెస్టోను విడుదల చేశారు. దిల్లీ ప్రజల కోసం ఐదు గ్యారెంటీలు ప్రకటించామని, గ్యారెంటీ అంటే పౌరుల హక్కు అని అర్థమని తెలిపారు. ఆప్, బీజేపీలు దిల్లీలో కాలుష్యాన్ని కట్టడి చేయలేకపోతున్నాయని విమర్శించారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆప్, బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తున్నాయి.

కేజ్రీవాల్‌పై కేసు

న్యూదిల్లీ: హర్యానా ప్రభుత్వం తమకు సరఫరా చేస్తున్న నీటిలో విషం కలుపుతోందని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన సంచలన ఆరోపణలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌పై చట్టపరమైన చర్యలకు హర్యానా ప్రభుత్వం సిద్ధమైంది. హర్యానా ప్రభుత్వంపై కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలకు ఆయనపై కేసు నమోదు చేయనున్నట్లు ఆ రాష్ట్ర మంత్రి విపుల్ గోయల్ బుధవారం తెలిపారు. కేజ్రీవాల్ బాధ్యతా రహితమైన ప్రకటన చేశారని... ఆయన ప్రకటన వల్ల హర్యానా, దిల్లీ ప్రజల్లో భయాందోళన నెలకొందన్నారు. సోనిపట్‌లోని చీఫ్ జ్యుడీషియల్ కోర్టులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా... హర్యానా ప్రభుత్వం తమకు సరఫరా చేస్తున్న నీటిలో విషం కలుపుతున్నదని, దీని కారణంగా రాజధానిలో సామూహిక మరణాల ప్రమాదం ఉందని రెండు రోజుల క్రితం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆరోపించారు. దీని కారణంగా దిల్లీలోని కొన్ని ప్రాంతాలకు ఆ కలుషిత నీటి సరఫరాను నిలిపివేయాల్సిన పరిస్థితి రావచ్చునని చెప్పారు. ఈ ఆరోపణలను తిరస్కరించిన హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ఎంపీ ధరంవీర్ సింగ్, ఇతర ఎంపీలు వారిపై మండిపడ్డారు. తమ గౌరవానికి భంగం కలిగించేలా ఆరోపణలు చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌పై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ ఆరోపణలు హర్యానా ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని ధరంవీర్ సింగ్ తెలిపారు.ఆరోపణలు రుజువు చేసే వాస్తవిక ఆధారాలను చూపాలని భారత ఎన్నికల సంఘం కేజ్రీవాల్‌ను కోరింది. యమునా నీటిని విషపూరితంగా మార్చే రసాయనాల స్వభావం, వాటి వివరాలను తక్షణం తమకు సమర్పించాలని లేఖలో ఆదేశించింది.

దిల్లీలో బీజేపీదే విజయం: ప్రధాని మోదీ

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం ఘోండా నియోజకవర్గం లో బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని చెప్పారు. ఫిబ్రవరి 5న దిల్లీలో ఆప్ సర్కారు పోయి, బీజేపీ సర్కారు వస్తుందని జోస్యం చెప్పారు. ఈ మాట తాను మాత్రమే చెప్పడం లేదని యావత్ దిల్లీ ప్రజలంతా అదే అంటున్నారన్నారు. దిల్లీ ప్రజలు ఇంటింటికి నల్లా నీళ్లు కావాలని, ట్యాంకర్ మాఫియా నుంచి విముక్తి కల్పించాలని కోరుకుంటున్నారని ప్రధాని చెప్పారు. గత 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ వారి ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఆప్ అబద్ధపు హామీలను ఇప్పుడు దిల్లీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వారంతా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఈ సభకు హాజరైన జన సంఖ్యే చెబుతోందన్నారు. దిల్లీ బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రధాని మెచ్చుకున్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించేలా ఉందన్నారు. 21వ శతాబ్దంలో దిల్లీని కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్లు, ఆప్ 11 ఏళ్లు పాలించాయని.. అయినా దిల్లీ ప్రజల బతుకుల్లో చెప్పుకోదగ్గ మార్పులు రాలేదని ప్రధాని మోదీ విమర్శించారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, పేలవమైన మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, కాలుష్యం, మురుగునీరు తదితర సమస్యలు దిల్లీ ప్రజలను వేధిస్తున్నాయన్నారు.

కాంగ్రెస్ వల్లే బీజేపీకి అధికారం: మమత

కోల్‌కతా: గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అధికారం రావడానికి కాంగ్రెస్సే కారణమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన సందర్భంగా 'బంగ్లార్ నిర్బచోన్ ఓ అమ్రా' పేరుతో తాను రాసిన మూడు పుస్తకాలను ఆమె బుధవారం విడుదల చేశారు. ఆ పుస్తకంలో 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై లోతైన విశ్లేషణ చేశారు. అయితే... బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ కారణమని మమత అందులో పేర్కొన్నారు. 'కేంద్రంలోని ఎన్డీయే ఓటమి లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ ఓ కూటమిగా ఏర్పడ్డాయి. అన్ని కార్యక్రమాలను ఉమ్మడిగా ముందుకుతీసుకెళ్లాయి. కానీ, నాయకత్వం కోసం కూటమిలోని అభ్యర్థులు పరస్పరం పోటీకి దిగారు. తృణమూల్ కాంగ్రెస్ శాయశక్తులా కృషి చేసినప్పటికీ కాంగ్రెస్ వైఫల్యం కారణంగా ఇండియా ఐక్య సంఘటనకు గెలుపు దక్కకుండా పోయింది. మెజారిటీ రాకపోయినా బీజేపీకి అధికారం దక్కింది' అని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా 'లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు కూడా మిత్రపక్షాల మద్దతు వల్లే దక్కాయి. ఇండియా ఐక్యసంఘటనకు ఎక్కువ మద్దతు రావడానికి తృణమూల్ కాంగ్రెస్సే కారణం. మా ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా ప్రజా మద్దతు లభించింది. రాష్ట్రంలో సీపీఎం నేతృత్వంలోని వామపక్షాలతో కాంగ్రెస్ సీట్ల పంపకాల ఒప్పందం చేసుకున్నప్పటికీ... తృణమూల్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా పని చేసింది. బీజేపీతో రహస్య ఒప్పందం చేసుకుంది' అని మమత ఆరోపించారు.

పొగమంచు... 50 వాహనాలు ఢీ

న్యూదిల్లీ: పొగమంచు కారణంగా వేర్వేరు హైవేలపై దాదాపు 50 వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... ఘజియాబాద్ సమీపంలోని దిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం ఉదయం దారి కనబడక వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దిల్లీ- మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేలోని మీరట్ -ఘజియాబాద్ క్యారేజ్‌వేలో హవా హవాయ్ రెస్టారెంట్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగింది. పొగమంచు కారణంగా దాదాపు 30 నుంచి 35 వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఆ తర్వాత బాగ్‌పట్ - దుహై క్యారేజ్‌వేపై 20 నుంచి 25 కార్లు ఢీ కొన్నాయి. రెండు ప్రమాదాలూ దట్టమైన పొగమంచు కారణంగానే జరిగినట్లు పోలీసులు తెలిపారు. విజిబిలిటీ సరిగా లేకపోవడంతోనే ప్రమాదాలు సంభవించినట్లు చెప్పారు. ఈ రెండు ఘటనల్లో ఐదుగురికి గాయాలైనట్లు చెప్పారు. గాయపడిన ఐదుగురిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు వెల్లడించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ... బీజేపీ డీఎన్ఏ

సీపీఎం నేత ప్రకాశ్ కారత్ విమర్శ

అగర్తలా: కేంద్రంలో, త్రిపురలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలపై సీపీఎం నాయకులు ప్రకాశ్ కారత్ బుధవారం విమర్శల దాడి చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం' అనేది బీజేపీ డీఎన్ఏలో పాతుకుపోయింది. ఎందుకంటే, ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకులను 'తప్పుడు ఆరోపణల' పై జైలులో పెట్టారు' అని ఆరోపించారు. స్వామి వివేకానంద మైదానంలో ర్యాలీ నిర్వహించాలన్న ప్రతిపక్ష పార్టీ అభ్యర్థనను తిరస్కరించడం ద్వారా త్రిపురలోని బీజేపీ ప్రభుత్వం దేశం ముందు తనను తాను బహిర్గతం చేసుకుందని ఆయన అన్నారు. బుధవారం ఇక్కడ ఒక ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, గత 11 సంవత్సరాలుగా దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి బీజేపీ ఏ అవకాశాన్నీ వదిలిపెట్టలేదని విమర్శించారు. జనవరి 31వ తేదీ వరకు జరిగే సీపీఎం 24వ రాష్ట్ర సమావేశం ప్రారంభానికి సూచికగా ఈ ర్యాలీ జరిగింది. కారత్ మాట్లాడుతూ 'గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలకు ముందు దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలుకు పంపారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా ఎన్నికలకు ముందు తప్పుడు కేసులపై జైలుకు వెళ్లారు' అని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని మార్చడానికి కుట్ర పన్నుతోందన్నారు. 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' కోసం పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టిందని, తద్వారా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంలో రాష్ట్రాల అధికారాన్ని తగ్గించే కుట్రకు ఒడిగడుతోంది' అని విమర్శించారు. 'త్రిపురలో బీజేపీ ప్రభుత్వం 2018 లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తూనే ఉంది. బీజేపీ అధికారంలో ఉన్నంత కాలం ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉంటుంది' అని అన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం ఈశాన్య రాష్ట్రంలో మత ఉద్రిక్తతలను సృష్టించేందుకు బీజేపీ 'గేమ్ ప్లాన్' చేసిందని తెలిపారు. 'సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ పాలనలో త్రిపుర ఎప్పుడూ మత ఘర్షణలను చూడలేదు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రం మత ఘర్షణలను ఎదుర్కొంటోంది. హిందువులు, ముస్లింల మధ్య ఉద్రిక్తతను సజీవంగా ఉంచడానికి ఇది వారి గేమ్ ప్లాన్' అని అన్నారు. 'మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను విస్మరిస్తూ కొద్దిమంది కార్పొరేట్ కుటుంబాలకు సహాయం చేసింది. ఇప్పుడు జనాభాలో ఒక శాతం మంది దేశ మొత్తం సంపదలో 40 శాతం నియంత్రణలో ఉన్నారు. బీజేపీ పాలనలో ఆర్థిక వివక్ష పెరిగింది' అని అన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి కూడా ర్యాలీలో ప్రసంగించారు.

పన్సారే హత్యకేసులో ఆరుగురికి బెయిల్

ముంబై: ప్రముఖ హేతువాది, రచయిత గోవింద్ పన్సారే హత్యకేసులో ఆరుగురు నిందితులకు బాంబే హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. సుదీర్ఘ కాలంగా జైలులో ఉన్నందున ఆరుగురు నిందితులకు బెయిల్ ఇస్తున్నానని ఏకసభ్య ధర్మాసనం పేర్కొన్నది. మరో నిందితుడు వీరేంద్ర సింగ్ తవాడే దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విడిగా విచారిస్తానని జస్టిస్ కిలోర్ చెప్పారు. 2018-2019 మధ్య వేర్వేరు తేదీలలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో 2015 ఫిబ్రవరి 20న మార్నింగ్ వాక్ నుండి ఇంటికి తిరిగి వస్తున్న పన్సారేను మోటార్ బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. తొలుత ఈ కేసును కొల్హాపూర్‌లోని రాజారాంపురి పోలీస్ స్టేషన్ దర్యాప్తు చేపట్టింది. అనంతరం మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సీఐడీ) పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కి బదిలీ అయింది. నిందితులను గుర్తించడంలో పురోగతి లేకపోవడంతో పన్సారే కుటుంబ సభ్యులు ఈ కేసును ఉగ్రవాద నిరోధక బృందం (ఏటీఎస్)కి బదిలీ చేయాలని కోరింది. 2022 ఆగస్ట్ 3న బాంబే హైకోర్టు ఈ కేసును ఏటీఎస్‌కి బదిలీ చేసింది. 12 మందిలో 10 మందిని అరెస్ట్ చేసి నాలుగు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేశారు. ఈ పది మంది నిందితులపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ఇద్దరు షూటర్లు ఇప్పటికీ పరారీలో ఉన్నారు.

రూ.16,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్

కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూదిల్లీ: క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వయంసమృద్ధి లక్ష్యంగా నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.16,300 కోట్ల వ్యయంతో ఈ మిషన్ అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వావలంబన సాధించడం, ఖనిజాల దిగుమతులపై ఆధారపడటం తగ్గించడం కేంద్రం లక్ష్యమన్నారు. ఈ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేందుకు ప్రభుత్వం రెండేళ్లుగా అనేక చర్యలు తీసుకుందన్నారు. ఈ రంగంలో స్వావలంబన సాధించాలనే విజన్‌కు అనుగుణంగా 2024-25 బడ్జెట్‌లో క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని గుర్తు చేశారు. అరుదైన ఖనిజ వనరులు ఉన్న దేశాలతో వాణిజ్యాన్ని మెరుగుపరచుకోవడం, దేశీయంగా ఖనిజ నిల్వల అభివృద్ధికి దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలను నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రోత్సహిస్తుందని మంత్రి చెప్పారు.

కొత్త ఆదాయపు పన్ను విధానంపై ఆశలు

న్యూదిల్లీ: మూడోసారి అధికారం చేపట్టిన మోదీ సర్కారు తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ముందుకు తీసుకురానుంది. దీనిలో ఏదోరకంగా ఊరట లభిస్తుందని వేతనజీవి ఆశగా ఎదురు చూస్తున్నాడు. సంకీర్ణ ప్రభుత్వం కావడం... కీలక భాగస్వామి జేడీయూ పాలించే బీహార్‌లో ఎన్నికలు ఈ ఏడాదే ఉండటంతో కచ్చితంగా ప్రజాకర్షక నిర్ణయాలు ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ప్రజలను దీని వైపు మళ్లించే యత్నం జరగొచ్చన్న అంచనాలున్నాయి. స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని 2020-21లో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిలో చాలా మార్పులు, చేర్పులు చేసి పన్ను చెల్లింపుదారులను ఆకర్షించేలా చేశారు. 2024 బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచారు. వేతన ఆదాయంపై పన్ను విధించడానికి ముందు స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని తీసేస్తారు. దీంతో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం తగ్గుతుంది. స్వల్ప మొత్తంతో అధిక ట్యాక్స్ స్లాబ్‌లో చేరేవారికి ఇది ఉపయోగపడుతుంది. కొత్త ఆదాయ పన్ను విధానంలో అందరికీ డీఫాల్ట్‌గా వస్తుంది. అవసరమైతే పాత దానిలోకి మారవచ్చు. కొత్త విధానంలో పెద్దగా మినహాయింపులు, తగ్గింపులు లేకపోవడంతో... పన్ను నిపుణులు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో దీనివైపు పన్నుదారులను మళ్లించేందుకు స్టాండర్డ్ డిడక్షన్ పెంపు ఒక్కటే బలమైన మార్గంగా ఉంది. పన్ను వ్యవస్థను సరళంగా ఉంచుతూ... అన్ని వర్గాలకు రాయితీలు అందించేలా ఇది ఉపయోగపడుతుంది. దీనిని ఈసారి రూ.75 వేల నుంచి రూ.లక్షకు మార్చాలనే డిమాండ్లు ఉన్నాయి. దీనికితోడు పన్ను ఆదాయంపై కొంత శాతం మేరకు తగ్గింపు ఇవ్వాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. ఇప్పటికే వ్యాపారులు, వృత్తి నిపుణులు పన్ను చెల్లించే వేళ తమ ఖర్చులను క్లెయిమ్ చేసుకొంటారు. వాస్తవంగా 1974లో తొలిసారి ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 16 కింద దీనిని తొలిసారి పరిచయం చేశారు. పన్ను సంక్లిష్టతలను తగ్గించి సరళతరం చేయడం దీని ఉద్దేశం. ఉద్యోగి ఆఫీసుకు వెళ్లి వచ్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు, ఆరోగ్య వైద్య ఖర్చులను వారికి తిరిగి ఇవ్వడం దీనిలో మరో కోణం. కానీ, 2005లో దీనిని పూర్తిగా తొలగించారు. దాదాపు దశాబ్దానికి పైగా ఎటువంటి పన్ను లబ్ధి ఇవ్వలేదు. తిరిగి 2018లో రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో దీనిని ప్రవేశపెట్టారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

రాంచీ: జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సోనువా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఓ మహిళ సహా ఇద్దరు మావోయిస్టులు మరణించారు. ఘటనా స్థలం నుండి రెండు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కొల్హాన్ రేంజ్ డీఐజీ మనోజ్ రతన్ ఛోటే తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో ఈడీ సోదాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) బుధవారం సోదాలు నిర్వహించింది. నకిలీ ల్యాబ్ సర్టిఫికెట్లతో ఓ ప్రైవేటు సంస్థ దేశీయంగా, అంతర్జాతీయంగా కల్తీ పాల ఉత్పత్తులు పంపిణీ చేసింది. జయశ్రీ గాయత్రి ఫుడ్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 63 నకిలీ ల్యాబ్ సర్టిఫికెట్లతో బహ్రెయిన్, హాంగ్‌కాంగ్, సింగపూర్, ఒమన్, కతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు నాసిరకం పాల ఉత్పత్తులు ఎగమతి చేసినట్లు నివేదికలు ఉన్నాయని ఈడీ వెల్లడించింది. ఈ కంపెనీ 'మిల్క్ మ్యాజిక్' అనే బ్రాండ్ పేరుతో అనేక రకాల పాల ఉత్పత్తులను వివిధ దేశాలకు భోపాల్ కేంద్రంగా ఎగుమతి చేస్తుంది. కల్తీ పాల ఉత్పత్తుల వల్ల వంద కోట్ల ఆదాయం ఉన్న కంపెనీ 2022 మార్చి 31 నాటికి రూ.500 కోట్లకు చేరిందని, ఆ కంపెనీ నికర విలువ 53.94 శాతం పెరిగిందని ఈడీ తెలిపింది.

వక్ఫ్ బిల్లుపై తుది ముసాయిదా ఆమోదం

మండిపడిన ప్రతిపక్ష సభ్యులు

రాజ్యాంగ విరుద్ధం... ప్రభుత్వ జోక్యమేనని విమర్శ

న్యూదిల్లీ: వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీ (జేపీసీ) తన నివేదికను, ప్రతిపాదిత చట్టానికి సంబంధించిన సంస్కరణను మెజారిటీ ఓటుతో ఆమోదించిందని ప్యానెల్ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ తెలిపారు. జేపీసీ సమావేశం బుధవారం ముగిసింది. 15-11 ఓట్లతో ఆమోదించబడిన బిల్లుపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. ఇది 'రాజ్యాంగ విరుద్ధం', ముస్లింల మతపరమైన విషయాలలో ప్రభుత్వ జోక్యాన్ని అనుమతించడం ద్వారా వక్ఫ్ బోర్డును నాశనం చేస్తుందని ధ్వజమెత్తారు. అయితే కమిటీ ఆమోదించిన అనేక సవరణలు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలను కూడా పరిష్కరించాయని, బిల్లును అమలు చేసిన తర్వాత వక్ఫ్ బోర్డు తన విధులను పారదర్శకంగా, మరింత సమర్థవంతంగా నిర్వర్తించడంలో సహాయపడుతుందని పాల్ పేర్కొన్నారు. మొదటిసారిగా 'పస్మాండ' (వెనుకబడిన) ముస్లింలు, పేదలు, మహిళలు, అనాథలు వక్ఫ్, ధార్మిక మత ప్రయోజనాల కోసం ముస్లింలు ఇచ్చే దానానికి సంబంధించి లబ్ధిదారులలో చేర్చడం జరిగిందని ఆయన అన్నారు. కాగా, జేపీసీ ప్రతిపాదించిన 14 సవరణలను ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. అయితే ప్రతిపక్ష ఎంపీలు సమర్పించిన 44 మార్పులను తిరస్కరించింది. దీనిపై రాజకీయ పార్టీలు ఆగ్రహం వెలిబుచ్చాయి. కీలక సవరణ రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక ఆస్తి వక్ఫ్ కాదా అని నిర్ణయించడానికి ప్రారంభంలో సంపూర్ణ అధికారం ఉన్న జిల్లా కలెక్టర్ స్థానంలో ఒక అధికారిని నియమించడానికి అధికారం ఇస్తుంది. 1995 వక్ఫ్ చట్టం ప్రకారం, ఈ అధికారం సర్వే కమిషనర్లు, అదనపు కమిషనర్లకు ఉంది. వక్ఫ్ బోర్డులలో ఇద్దరు ముస్లిమేతర సభ్యులను 'తప్పనిసరిగా' చేర్చడాన్ని కూడా కమిటీ తొలగించింది. ఒక పండితుడితో సహా సభ్యత్వాన్ని ముగ్గురికి పెంచడం ద్వారా పునర్నిర్మించిన కూర్పును ప్రతిపాదించింది. జేపీసీ చైర్మన్, బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ విలేకరులతో మాట్లాడుతూ ఇది ప్యానెల్ చివరి సమావేశం అని, మెజారిటీ ఓట్ల ఆధారంగా 14 సవరణలను ఆమోదించామని అన్నారు. 'గత ఆరు నెలల్లో మేము అనేక సవరణలను చర్చించాం. అన్నీ ఈరోజు ఓటింగ్‌కు ఉంచడం జరిగింది. సభ్యులు తమ తీర్పును ఇచ్చారు. 16 మంది అనుకూలంగా ఓట్లు వేయగా, 14 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు' అని పాల్ తెలిపారు. జనవరి 31 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందుతుందా అని విలేకరులు అడిగినప్పుడు, ఈ నివేదికను గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తామని, తదుపరి కార్యాచరణను నిర్ణయించాల్సింది ఇప్పుడు తనపై, పార్లమెంటుపై ఉందని చెప్పారు. గత ఏడాది ఆగస్టు 8న ఏర్పాటు చేసినప్పటి నుంచి కమిటీ దేశ రాజధానిలో 38 సమావేశాలు నిర్వహించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా పర్యటించింది. దీని ద్వారా కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, ఏఐఎంఐఎంతో సహా ప్రతిపక్ష ఎంపీలు పాల్ అధ్వర్యంలో కమిటీ పనితీరు, బిల్లును ఆమోదించిన తీరుపై తమ తీవ్ర విమర్శలను కొనసాగించారు. వారిలో కొందరు తమ అసమ్మతిని తెలిపారు. దీనిపై తమ ఆమోదం తెలిపేందుకు బుధవారం సాయంత్రం 4 గంటల వరకు సమయం ఇచ్చారు. అయితే 655 పేజీల నివేదికను మంగళవారం రాత్రి తమకు పంపిణీ చేశారని, దానిని అధ్యయనం చేయడానికి, వారి అసమ్మతిని సిద్ధం చేయడానికి వారికి తక్కువ సమయం ఇచ్చారని వారు చెప్పారు.

టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ కమిటీ పరిశీలన, సిఫార్సులు 'పూర్తిగా వికృతమైనవి' అని పేర్కొన్నారు. ప్రతిపాదిత చట్టం వక్ఫ్ బోర్డులను నాశనం చేస్తుందని, దాని పనితీరులో ప్రభుత్వ జోక్యానికి దారితీస్తుందని ఒవైసీ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ ఈ సవరణలను 'రాజ్యాంగ విరుద్ధం' అని, ఈ బిల్లు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని రూపొందించబడిందని విమర్శించారు. డీఎంకేకు చెందిన ఎ.రాజా తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు ఉభయ సభలలో సౌకర్యవంతమైన మెజార్టీ ఉన్న పార్లమెంటు ప్రతిపాదిత చట్టాన్ని ఆమోదించిన తర్వాత తమ పార్టీ సుప్రీం కోర్టులో సవాలు చేస్తుందన్నారు. అయితే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఈ విమర్శలను తోసిపుచ్చుతూ, ప్రతిపాదిత చట్టం వక్ఫ్ బోర్డులలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

ఇది ముస్లిం సమాజానికి సాధికారత కల్పిస్తుందని తెలిపారు. చైర్మన్ పక్షపాతంతో, అధికార పార్టీకి అనుకూలంగా ఉండటానికి అనవసరమైన తొందరపాటుతో ఉన్నారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. ఒక ఉమ్మడి ప్రకటనలో, 11 మంది ప్రతిపక్ష ఎంపీలు... చైర్మన్ జగదాంబికా పాల్ 'నిరంకుశ' ప్రవర్తనను విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రక్రియను వేగవంతం చేశారని మండిపడ్డారు. చర్చలు ముగియగానే, చైర్మన్ ప్రవర్తనకు వ్యతిరేకంగా తాము అధికారికంగా తమ నిరసనను తెలియజేస్తున్నాం' అని ప్రకటన పేర్కొంది.

డాక్టర్ నిర్లక్ష్యం... గుండెపోటుతో మహిళ మృతి

లక్నో: డ్యూటీలో ఉన్న డాక్టర్... మొబైల్ ఫోన్‌లో రీల్స్ చూడటంలో నిమగ్నమై గుండె నొప్పితో బాధపడుతున్న మహిళను ఎమర్జెనీ వార్డులోకి తీసుకువచ్చినప్పటికీ పట్టించుకోకపోవ డంతో ఆమె మృతి చెందిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... ప్రవేశ్ కుమారి (60) మంగళవారం తీవ్ర ఛాతినొప్పితో బాధపడుతూ కుమారుడు గురుశరణ్ సింగ్‌కు ఈ విషయాన్ని ఆమె చెప్పింది. దీంతో మహారాజా తేజ్ సింగ్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తీసుకువచ్చారు. కాగా, ఎమర్జెన్సీ వార్డులో డ్యూటీలో ఉన్న డాక్టర్ ఆదర్శ్ సెంగర్ తన మొబైల్ ఫోన్‌లో సోషల్ మీడియా రీల్స్ చూడటంలో బిజీగా ఉన్నాడు. ఆ మహిళ పరిస్థితి గురించి ఆమె కుమారుడు, బంధువులు డాక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అతడు పట్టించుకోలేదు. ఆమెను చూడాలని నర్సులకు చెప్పాడు. మొబైల్ ఫోన్ చూడటంలో నిమగ్నమయ్యాడు. మరోవైపు ఆ డాక్టర్ ఎదుటే విలవిలాడిన ఆ మహిళ గుండెపోటుతో మరణించింది. దీంతో మహిళ కుమారుడు నిలదీయగా అతడి చెంపపై కొట్టాడు. మహిళ బంధువులు ఆగ్రహించి ఆ డాక్టర్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలిసి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వెంటనే అక్కడకు చేరుకున్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. కాగా, ప్రభుత్వ ఆసుపత్రి వార్డులోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కోసం, తద్వారా లబ్ధిపొందడం కోసం విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన 2025 సంవత్సర నూతన క్యాలెండరును మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్, డి.యస్.జగన్, డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నెలకొన్న పారిశుధ్య, రోడ్లు, డ్రైనేజీ లాంటి సమస్యల పరిష్కారంపై విఆర్పీ శంఖారావం పూరించింది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునిల్ గతంలో కాలనీవాసులుకు ఇచ్చిన హామీ మేరకు బుధవారం కాలనిలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంకై పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శైలజ, కార్పొరేషన్ ఇంజనీర్లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ప్రజల నుంచి పారిశుధ్య, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజి కాలువల్లో పూడికలు, కాలనిలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించి శుభ్రపరచాలని సిబ్బందికి అధికారులు ఆదేశించారు. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుకుడు సునీల్, యకత్ పుర నియోజకవర్గ ఇన్చార్జ్ నంద్యాల అనిల్ కుమార్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇజ్జగిరి కమలాకర్, జిహెచ్ఎంసి అధ్యక్షులు భాగవతుల మహేష్, జిహెచ్ఎంసి కార్యదర్శి అనిల్ గోకికార్, వగ్గు వినయ్, అఖిల్ కదారి నాయకులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో

ఉద్యోగుల పాత్ర ముఖ్యమైనదని

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర ముఖ్యమైనదని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీని అదనపు కలెక్టర్ టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరవేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి ఉద్యోగులు వారధిలా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగులందరు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎప్పటికప్పుడు సంసిద్దులుగా ఉంటారని, మా ఉద్యోగులందరు కూడా ప్రభుత్వనికి అన్ని వేళల సహకరిస్తుంటా మని, చిత్త శుద్ధితో పనిచేస్తు, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులకు 24శాతం హెచ్ఆర్ఏ ను తిరిగి పునరుద్ధరించాలని అన్నారు. అధికారులు ఉద్యోగ పనులు నిమిత్తం ఓఆర్ఆర్‌లో వెళ్లినప్పుడు టోల్ టాక్స్ పడకుండా ఎక్సంప్షన్ ఇప్పించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా టిజిఓస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే రామారావు మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో అన్ని సంక్షేమ పథకాలను అమలు పర్చడంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాలానుసారం మన జిల్లా అధికారులు ముందున్నారని, కలెక్టర్ ప్రోత్సాహంతో మునుముందు మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి రంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానం వచ్చేటట్లు పనిచేస్తామని తెలిపారు. టీ.ఎన్.జి.ఓ.స్. సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బి.శ్యాం, నరహరి, గంప శ్రీనివాస్, పరమేశ్వర్ రెడ్డి, శిరీష, సుజాత, రంగారెడ్డి కార్యదర్శి సురేష్ కుమార్ నోరి, అసోసియేట్ అధ్యక్షులు పీసీ వెంకటేష్, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నూతన కంటి వెంకట్, అలివేలు, రేవతి, బాలరాజు, సంయుక్త కార్యదర్శులు లక్ష్మణస్వామి, అనిత, మహేశ్వరి, సుజాత, వెంకటేశ్వర్లు, నరేందర్, సైదమ్మ, రాకేష్, మహేందర్, నాగేశ్వరరావు, సుజాత, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వివిధ డిపార్టెంట్ల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లాలో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్ డివిజన్ కు చెందిన పి.లక్ష్మి అనారోగ్య సమస్య కారణంగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలియజేయడంతో, అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ఓసి ద్వారా 2,50,000 మంజూరు చేయించి, ఎల్ఓసి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని ఆయన చెప్పారు. ప్రజాపాలన ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

వచ్చే ఐదు నెలలకు ప్రణాళిక రూపొందించాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : వచ్చే ఐదు నెలల కోసం మిషన్ భగీరథ సిబ్బంది ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. వేసవి ముగిసే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. గాలి తర్వాత నీరే మనుషులు కావాలి అవసరమని, కోట్ల మందికి నిరంధించే అదృష్టం మనకే దక్కిందని తెలిపారు. ప్రతి మనిషికి 100 లీటర్ల నీటిని ప్రతిరోజు అందించాల్సిందే అని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో మండల స్థాయిలో క్రీమ్ కమిటీ వేసి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవడంతోపాటు, మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టలన్నారు. మిషన్ భగీరథ పై వేల కోట్లు ఖర్చు చేసినా, ప్రజలు ఎందుకు ఆ నీటిని పూర్తిస్థాయిలో వినియోగించడం లేదో అధ్యయనం చేయాలని సూచించారు. ఎంతమంది మిషన్ భగీరథ నీరు తాగునీటి కోసం వినియోగించడం లేదో సర్వేలు చేపట్టండని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మేర మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నాము, ఎన్ని గృహాలకు నీరు అందటం లేదు వంటి వివరాలను ఎమ్మెల్యేలకు అందజేయ లన్నారు. మిషన్ భగీరథ నీళ్లు వాడేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టండని, ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించాలన్నారు. ప్రతి ప్రాణం ముఖ్యమైనదని మిషన్ భగీరథ నీటి కారణంగా ఎవరు అనారోగ్యం పాలు కాకూడదని, ఆ బాధ్యత మిషన్ భగీరథ ఇంజనీర్లదే అని చెప్పారు. అడవులలో తిరిగినప్పుడు నేను అన్ని రకాల నీళ్లు తాగాను, అయినా నాకు ఏమి కాలేదని, కానీ ఇప్పుడు ప్రజలు ఆర్వో ప్లాంట్లకు అలవాటై సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని కావున ఈ విషయంలో అధికారులంతా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీవితంలో అన్నిటికంటే ఉత్తమమైనది విద్య...

జీవితంలో అన్నిటికంటే ఉత్తమమైనది విద్య అని, విద్యతోనే వికాసం సాధ్యపడుతుందని మంత్రి సీతక్క అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం తెచ్చి 6-14 సంవత్సరాల మధ్య పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టిందన్నారు. విద్యను ఎవరు దోచుకోలేరు, విద్య పంచుకుంటేనే విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ఆ ఉద్దేశంతో విద్య దన్ ఫౌండేషన్ పనిచేయడం అభినందనీయమన్నారు. విద్య ద్వారానే నా లైఫ్ ఈ స్థాయికి వచ్చిందని పేర్కొన్నారు. నేను ఒక టెన్త్ క్లాస్ వరకు చదువుకున్న తర్వాత పదేళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపానని గుర్తు చేసుకున్నారు. బయటకొచ్చిన తర్వాత తిరిగి విద్యార్థిగా చదువును కొనసాగించానని, చదువుకోవాలి అన్న పట్టుదలతో ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం, ఎం.ఏ, పిహెచ్డి పూర్తి చేశారు. ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నా విద్యను ఆపలేదని, ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎంఏ కోర్సును జాయిన్ అవ్వాలనుకుంటున్నానని చెప్పారు. అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం గొప్పది, జ్ఞానాన్ని లక్షల మందికి పెంచడం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేసిన వాళ్లమవుతామని తెలిపారు. విద్య, అభివృద్ధిలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నాయని, ఆ అంతరాలను తొలగించే దిశలో అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. మారిన పరిస్థితుల్లో మానవ సంబంధాలు బలహీన పడుతున్నాయన్నారు. మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలని, పేదలకు విద్య అందించే విద్యాధన్ ఫౌండేషన్కు మా ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని పేర్కొన్నారు.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలకు ప్రత్యేక కృషి చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీవితంలో ఎస్ఎస్‌సి పరీక్ష ఉత్తీర్ణత తొలి మెట్టని ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల లక్ష్య సాధనకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణత శాతం పెంపుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జీవితంలో తొలిమెట్టని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఎస్ఎస్సి, ఇంటర్మీడియేట్‌లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి సాధించేలా కృషి చేయాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న టీచర్ల కొరత పూర్తి చేసామని అలాగే అన్ని సబ్జెక్ట్‌లకు టీచర్స్ ఉన్నారని అన్నారు. అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించామని, పిల్లలో పరీక్షల భయం ఉండకుండా ముందుగా ప్రత్యేక తరగతులులలో స్లిప్ టెస్ట్, గత ప్రశ్న పత్రాలపై పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బంగారు తెలంగాణ నిర్మాణం కోసం జ్ఞానవంతులను తయారు చేయడానికి ఉపాధ్యాయులు తమ యొక్క జ్ఞానాన్ని అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లో మాట్లాడే గలిగే, మెరుగ్గా రాయగలిగే, సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కొనే పుణ్యాలను విద్యార్థుల లో పెంపొందించాలని అన్నారు. హైదరాబాద్ జిల్లాను ఎస్ఎస్సి ఇంటర్మీడియట్ పరీక్షల రిజల్ట్స్‌లో టాప్‌లో ఉండేలా చూడాలని ఆదేశాల పని చేసిన ఉపాధ్యాయులకు ఆగస్ట్ 15న అవార్డు ఇచ్చి సన్మానించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వచ్చే జూన్‌లో విద్యాపరమైన అంశాల పై సమావేశం ఏర్పాటు చేయాలని డిఈఓ ను ఆదేశించారు. మంత్రి ఈ సందర్భంగా గత సంవత్సరంలో జిల్లాలో పదవతరగతి ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ శాతం ఈ ఈ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై మండలాల వారీగా సమీక్షించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేయాలని అన్నారు. అన్ని పాఠశాలలో ఎక్కడకూడా సబ్జెక్ట్ టీచర్ల కొరత లేదని మాథ్స్, సైన్స్ సబ్జెక్ట్స్ లలో వెనుకంజలో ఉన్న పిల్లలకు ప్రత్యేక బోధన కల్పించాలని సూచించారు. పిల్లలకు మార్గదర్శనం చేయాలని, సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. డిఆర్ఓ ఈ.వెంకటాచారి, డిఈఓ రోహిణి, డి ఐ ఈ ఓ ఒడ్డెన్న, ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ అధికారులు కోటాజీ, ఆశన్న, ఇలియాస్ అహ్మద్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాలు, లెక్చలర్స్ తదితరులు పాల్గొన్నారు.

31న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 31న బీసీ హక్కులసాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం వరంగల్‌లో జయప్రదం చేయండి. బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈనెల 31న ఉదయం వరంగల్ హంటర్ రోడ్‌లోని ఐరన్ అండ్ సిమెంట్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటిపాముల వెంకట్రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు, జనాభా ప్రాతిపదికన చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్ల పెంపు, బడ్జెట్లో బీసీల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద మొత్తంలో నిధులు, సంక్షేమ పథకాల అమలు తీరు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి డిమాండ్‌ల సాధనకై తగిన పోరాట కార్యక్రమాన్ని సమావేశంలో రూపొందించడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యులు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సకాలంలో సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పగడ్బందీగా మహాత్మాగాంధీ వర్ధంతి ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకల ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం బాపు ఘాట్‌ను సందర్శించి బాపు సమాధి, సెంట్రల్ మ్యూజియం హాల్, గాంధీ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 30 గాంధీవర్ధంతి రోజున రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు, ఉన్నతాధికారులు బాపుఘాట్‌లో మహాత్మ గాంధీకి నివాళులర్పిస్తారని కలెక్టర్ తెలిపారు. బాపు ఘాట్‌లో రిషప్షన్, బాపు సమాధి, సెంట్రల్ మ్యూజియం హాల్‌లో శ్రద్ధాంజలి కార్యక్రమం అలాగే గాంధీ విగ్రహం వద్ద 2 నిముషాలు మౌనం, ప్రోటోకాల్ తప్పక పాటించాలని, ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. నిరంతరం విద్యుత్ ఉండాలని, సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ఏర్పాటు చేయాలనీ సౌండ్ సిస్టమ్‌లో రి సౌండ్ ఉండకుండా చూడాలని సూచించారు. రెండు మెడికల్ శిబిరాల ఏర్పాటుతో పాటు అంబులెన్సును అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఆహల్య రెడ్డి, ఉద్యానవన శాఖ, ఆర్ అండ్ బి ఈఈ ఎలక్ట్రిసిటీ, పోలీస్, జిహెచ్ఎంసి ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : చదువుతోపాటు పాటు క్రీడలను ప్రొత్సహించాలని, క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. బుధవారం హకీంపేట్ లోని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ ను జిల్లా కలెక్టరు గౌతం సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్‌లో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కు సూచించారు. టెన్నీస్, బ్యాడ్ మెంటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ లో స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టరు సూచించారు. స్కూలులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యతోపాటు క్రీడలను ఏవిధంగా నేర్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలులో గల విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాలులను, గ్రౌండ్స్, డైనింగ్ హాల్, కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులను భోనజం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్ లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్ లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రావు ప్రస్తుతం స్కూల్ లో 4 వతరగతి నుండి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందని కలెక్టరుకు తెలియజేసారు. ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని తెలిపారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియోథెరపి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

31న మొగిలిగిద్ద గ్రామానికి సీఎం రాక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగలిగిద్ద గ్రామానికి వస్తున్నారు. ఘనచరిత్ర కలిగిన మొగలిగిద్ద గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మొగలిగిద్ద గ్రామానికి 31న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారు అయిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 10వేల మంది హాజరవుతారన్నారు. 150 వార్షికోత్సవ పాఠశాలకు సంబంధించిన విద్యాభివృద్ధి కార్యక్రమం కాబట్టి పదివేల మందితో 16 ఎకరాల్లో పర్యటన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సహజంగా ముఖ్యమంత్రి రాక సందర్భంగా గ్రామ అభివృద్ధి పై కొంత ఆసక్తి నెలకొని ఉంటుందని అయితే ముఖ్యమంత్రి గ్రామ అభివృద్ధి కోసం ఎలాంటి ప్రణాళిక చర్యలు తీసుకోవాలో ఆలోచించడం జరుగుతుందని, ప్రజల అంచనాలకు అనుగుణంగానే అభివృద్ధి ఉంటుందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఇంత వృద్ధాప్యంలో కూడా విద్య అభివృద్ధి కోసం పడుతున్న తాపత్రయం ఎంతో గొప్పదని అభివర్ణించారు. గత పదేళ్లలో మొగిలిగిద్ద లో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఒక చరిత్ర కలిగిన గ్రామం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో గ్రామ అభివృద్ధి గ్రామ చరిత్ర దశ దిశల వ్యాపిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాంత అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ఎంతో మంది కృషి చేస్తున్నారని ఈ పాఠశాలలో చదువుకొని ఎంతో ప్రయోజ కులైన వారు ఉన్నారని ముఖ్యమంత్రిగా బూరుగుల రామకృష్ణారావు, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ఇంకా విద్యుత్‌శాఖ పోలీసు శాఖ రెవెన్యూ శాఖ విద్యాశాఖ ఇంకా అనేక ప్రైవేటు రంగాలలో ఎంతోమంది గొప్ప స్థితిలో ఉన్నవారు ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఉన్నారన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, బాలరాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రఘునాయక్, జంగ నరసింహ యాదవ్, రాజు. వీరేశం, హరి నాథ్‌రెడ్డి, అనుమారి వెంకటయ్య, శ్యాం సుందర్, సయ్యద్ సాదిక్, ఖాదర్ గోరి,ఖలేద్, జాంగారి రవి, నల్లమోని శ్రీధర్, ముబారక్, ఖదీర్, సీతారాం, అశోక్, మహబూబ్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సాంస్కృతిక ప్రజా యుద్ధ నౌక గద్దర్ ను అవమానించేలా వివాదాస్పద వ్యాఖ్యలకు మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని, ఆ వ్యాఖ్యలను బండి సంజయ్ భేషరతుగా వెనక్కి తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ తెలంగాణ సంస్కృతిని, సమాజాన్ని అవమానపర్చేలా హోదాను మర్చి వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం సాక్షిగా పార్లమెంట్ సభ్యుడుగా ఎన్నికైన బండి, కేంద్ర పురస్కార అవార్డుల అంశంలో ఏ అధికారంతో గద్దర్ గురించి ప్రస్తావించారో తెలపాలని డిమాండ్ చేశారు. కేంద్ర అవార్డులు మొత్తం స్వతంత్ర సంస్థ ద్వారా ఎంపిక చేస్తారని, ఆయా రంగాలలో విశిష్ట సేవలకు గాను ప్రధానం చేస్తారే గానీ బండి సంజయ్ చెబితే అవార్డులు ఇవ్వరని వారు స్పష్టం చేశారు. కానీ, ఇవన్నీ తెలిసిన మంత్రి ఇలాంటి వివాదాస్పదంగా మాట్లాడటం అప్రజాస్వామికమన్నారు. ఒకవేళ బీజేపీ నేతలు చెప్పిన వాళ్లకే అవార్డుల ప్రధానం జరిగితే ఈ దేశం లో ద్వంద్వ విధానాలను, విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తున్నట్లే అని వారు ఆరోపించారు. దేశంలో హిందూ త్వం పేరుతో అణగారిన వర్గాల ప్రజ లను గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో మారణహోమం చేసిన బీజేపీ ఈ దేశానికి ప్రమాదమని ఉద్ఘాటించారు. దేశ స్వాతంత్ర్యంలో బీజేపీ పాత్రే లేదని, దేశంలో జరిగిన ఏ పోరాటంలో బీజేపీ పాత్ర లేకున్నా చరిత్రను వక్రీకరించడంలో బీజేపీ నీచ రాజకీయాలు చేస్తూ దేశంలో మత అజెండాను అవలంభిస్తున్నారని అన్నారు. అందుకే బండి సంజయ్ బహిరంగంగా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివ కుమార్.. కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, అనీల్‌కుమార్, హేమంత్ కుమార్, అరుణ్, భగత్ సింగ్, వీరేశ్, భాను, భాను ప్రకాష్, సంజయ్, నగేష్, శివ కుమార్, వంశీ, గణేష్, చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

31న తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను పటాపంచలు చేయడానికి ఈనెల 31వ తేదీన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటల నుంచి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాగృతి సంస్థ ప్రకటించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్లు రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా గతంలో కేసీఆర్ గారు నిర్మించిన కీలక ప్రాజెక్టులపై దుష్ప్రచారం చేస్తున్నదని, కాబట్టి ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని తెలంగాణ జాగృతి అభిప్రాయపడింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఈ రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా తిప్పికొడతామని స్పష్టం చేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేసింది. ఈ అన్ని అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, ఆ మేరకు తీర్మానాలను ఆమోదిస్తామని తెలియజేసింది. కేసీఆర్ ప్రారంభించారనే అక్కసుతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేసే పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా నిలిపివేసింది. సీతారామ ఎత్తిపోతలను ప్రచార ఆర్భాటం కోసం అధికారికంగా ప్రారంభించి ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పనులను నిలిపివేసింది. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల్లోని పెండింగ్ పనులను చేపట్టడం లేదన్నారు. కృష్ణా, గోదావరి నదులపై చేపట్టిన ప్రాజెక్టులతో పాటు కృష్ణాలో న్యాయమైన నీటి వాటాల సాధన కోసం కొత్త ట్రిబ్యునల్ సాధించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదే.. దానిపై కాంగ్రెస్ పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తోందన్నారు.

ఏఐతో ఇందిరమ్మ ఇళ్ల పథకం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావులేకుండా లబ్ది దారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక నుండి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే వరకూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్-ఎఐ) వాడుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక యాప్‌ను రూపొందించి సర్వే నిర్వహించడం జరిగిందని ఇండ్ల నిర్మాణం, చెల్లింపులలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా రోజువారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేలా ఏఐని ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిజమైన నిరుపేదలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. మొబైల్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) టెక్నాలజీతో సరిపోలుస్తూ అనర్హులను గుర్తించి అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని, ఈ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించేలా ఏఐ టెక్నాలజి ని వాడుకోవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అనర్హులు ఎవరైనా ఉంటే పూర్తిగా గుర్తించే అవకాశాలు ఈ నూతన సాంకేతిక విధానం వలన సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 4 ప్రతిష్టాత్మక పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. దీనిలో తొలి విడతగా నివాస స్థలం కలిగిన 72 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేయడం జరిగిందని ఈ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలివిడత ఇండ్ల మంజూరులో అత్యంత నిరుపేదలు, వికలాంగులు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లకు ప్రాధాన్యత ఇస్తునట్టు తెలిపారు. హౌసింగ్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ పాల్గొన్నారు.

బండి కార్పొరేటర్ కాదు... మంత్రి అని గుర్తు పెట్టుకోవాలి

ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : బండి సంజాయ్ ఇంకా తాను కార్పొరేటర్ మాదిరిగా మాట్లాడుతున్నారని కానీ ఆయన ఓ కేంద్ర మంత్రి అనే విషయం గుర్తు పెట్టుకోవలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డుల విషయంలో పార్లమెంట్ జీరో అవర్‌లో లెవనెత్తుతా అని స్పష్టం చేశారు. బండి సంజయ్ కార్పొరేటర్ కాదు కేంద్ర మంత్రి అని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. హరీష్ రావు ముందు కేసీఆర్‌ను ప్రజలకు దర్శనం ఇవ్వాలని చెప్పాలని, కేంద్రం బీహార్‌కు, ఏపీకి ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వట్లేదని, అందుకే బడ్జెట్‌లో మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో 8మంది ఎంపీలు ఉన్నారని, తెలంగాణ ప్రజలు 8మంది బిజేపి ఎంపిలను గెలిపించారని అన్నారు. లక్ష్మణ్ రాజ్య సభ ఎంపీగా ఉండి ట్రిపుల్ ఆర్ పై భువనగిరి పోయి పిర్యాదు చేయడంపై వాళ్ల వైఖరి అర్థం చెసుకోవచ్చన్నారు. హైదరాబాద్ ట్రిపుల్ ఆర్ కోసం కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కలిశారని, ట్రిపుల్ ఆర్ హైదరాబాద్ లైఫ్ లైన్ దానికి రూ.45వేల కోట్లు అవసరమన్నారు. మూసి కోసం పార్లమెంట్‌లో ఎంపీలందరం కొట్లాడాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర కంటే మన రాష్ట్రం ఎక్కువగా కేంద్రానికి జీఎస్టీ పే చేస్తుందన్నారు. పది ఏండ్లు రాష్ట్రానికి రావాల్సిన నిధులను రప్పించడంలో బీఆర్ఎస్ విఫలమైందని, హైదరాబాద్ లో గ్రీన్ పీల్డ్ హైవే, డ్రై పోర్ట్ పెట్టబోతున్నామని, పార్టీ ఏ అవకాశం ఇచ్చినా స్వీకరిస్తా అని పేర్కొన్నారు.

ప్రతి పౌరుని 'హెల్త్ ప్రొఫైల్'ను రూపొందించేందుకు చర్యలు

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి పౌరుని 'హెల్త్ ప్రొఫైల్'ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందు కోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ఆధారిత మొబైల్ యాప్ వెబ్ దోహదపడతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ మాడ్యూర్ హస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన 'ఎండిఆర్.మై డిజి రికార్డ్' మొబైల్ యాప్ మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మాడ్యూర్ హస్పిటల్స్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మోటూరి కృష్ణప్రసాద్, వ్యవస్థాపక సిఈఓ డాక్టర్ సరోజ్ గుప్తా, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ క్రిస్ హంఫ్రెయ్స్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగిస్తూ ప్రజలు, ముఖ్యంగా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవడానికి ఎఐ ఆధారిత మొబైల్ యాప్ రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఒక ఆసుపత్రిలో చికిత్స పొందిన వ్యాధిగ్రస్తుడు మెరుగైన వైద్య సదుపాయాలు, చికిత్స కోసం తన వ్యాధికి సబంధించిన వివరాలతో మరోక ఆసుపత్రికి వెళ్ళి సంబంధిత ఆసుపత్రి రోగి వ్యాధికి సంబంధించిన వివరా లను విశ్వసించడం లేదన్నారు. ఫలితంగా మరోసారి ఆ వ్యాధిగ్రస్తునికి మళ్ళీ అన్ని వైద్య పరీక్షలు చేయడం వల్ల రోగి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా దన్నారు. ఇలాంటి పరిస్థితిని నివారించడా నికి, ఏ ఆసుపత్రికి వెళ్ళినా ప్రజలకు సంబంధించిన ఆరోగ్య వివరాలు విశ్వసీయంగా, అందు బాటులో ఉండే విధంగా ప్రజల సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని రూపొందిం చాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఎఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా ఒక వ్యక్తి పూర్తి రక్తపోటు, మధుమేహ, తదితర ఆరోగ్య వివరాలను వెంటనే తెలియజేయడం ద్వారా రోగికి మెరుగైన చికిత్సను అందించడంతో పాటు అతనికి ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు.

మొగలిగిద్ద, చించోడులను మండలాలుగా ప్రకటించాల్సిందే

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో ఉన్న మొగలిగిద్ద, చించోడు గ్రామాలను రెండు మండలాలుగా ప్రకటించాలి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మొగిలిగిద్ద చించోడు గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని ధర్నాలు చేసి, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇంకా మండలాలుగా ప్రకటించక పోవడం ఏమిటని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఒకవేళ మొగిలిగిద్ద, చించోడు మండలాలను 48 గంటల్లోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిస్తే నేనే ఆయనకు ఎదురెల్లి స్వాగతిస్తానని, సభా ముఖంగా ధన్యవాదాలు తెలియజేస్తానని, రెండు మండలాలకు, ఒక్కొక్క మండలానికి కలిపి కోటి రూపాయల అభివృద్ధి విరాళం స్వయంగా ముఖ్యమంత్రి కి చెక్కు రూపంలో ఇస్తానని మీడియా సమావేశంలో తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని ఎందుకు చేపట్టడం లేదని, ప్రభుత్వ కళాశాలకు ప్రైవేట్ చందాలు ఎందుకుని అన్నారు. అందుకు సంబంధించిన నిధులు లేవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తే తన వంతు సహాయ సహకారాలు అందించి వస్తు రూపకంగా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మొగిలిగిద్ద వాసి రాధాకృష్ణ,గుట్ట రాజు మాట్లాడుతూ ఇంతకుముందు తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుతం ఎమ్మెల్యే వెంబడి తిరిగి మొగిలిగిద్ద మండలం కోసం అనేక ధర్నాలు చేశామని, రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపామని, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు గ్రామంలో అధిక మెజారిటీ ఇచ్చామని, గెలిచిన తర్వాత సంవత్సరం వరకు కూడా మండలాన్ని ప్రకటించకపోతే పరిణామాలు కూడా అలాగే ఉంటాయని తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపులపై సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కి తరచూ ఈమెయిల్, కాల్స్ ద్వారా బాంబ్ ఉన్నట్టు సమాచారం వస్తున్నదని ఈ సమయంలో చదువుకుంటున్న వేలాదిమంది విద్యార్థులు భయ భ్రాంతులకు గురవుతున్నారని, ఇంతటి బెదిరింపులు వస్తున్న లోపల వార్తలను బయటకు రాకుండా పోలీసులకు చెప్పకుండా దాస్తున్న సదరు పాఠశాల చైర్మన్ కొమురయ్యను విచారణ జరపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాచారం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.రుద్వీర్ కుమార్‌కు ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ పోలీస్‌యంత్రాంగం విచారణ జరిపించి బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో బాంబ్ బెదిరింపులు వస్తున్నప్పుడు పాఠశాలకు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల యజమాన్యం భద్రత పెంచాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొమురయ్య బిజెపి నుండి ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేస్తున్నారని, ప్రచార వాతావరణం చేసుకుంటున్నా రేమో అని అనుమానం తమకు వ్యక్తం అవుతుందన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ధైర్యాన్ని కూలిపోకుండా జాగ్రత్త తీసుకో వాల్సిన అవసరం ప్రభుత్వం పైన ఉందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు పంపించి వారి తల్లిదండ్రులు రకరకాల పనులు వెళ్తూ ఉంటారు, వారికి ప్రతిసారి భయాన్ని గురి చేసే విధంగా సమా చారం ఇస్తున్నారు. బాంబ్ పెట్టారని బెదిరిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి మరియు పోలీస్ శాఖను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, జి. స్వప్న, ప్రీతం, అంజి, సంజు యాదవ్, మహేంద్ర పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను అరికట్టాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాల బిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ బేరాక్ చర్చ్ ఎదురుగా ఓ అక్రమ నిర్మాణదారుడు మున్సిపల్ చట్టానికి వ్యతిరేకంగా జి+2 అనుమతులు పొంది జి+6 అదునపు అంతస్థులు నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అదే విధంగా ఈ నిర్మాణం పక్కనే ఉన్న సర్వే నెంబర్ 87 కొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కార్పొరేషన్‌లో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ స్థలాలను, ఎక్కడికక్కడే కబ్జా చేసి మరి ఇష్టానుసారంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మొద్దు నిద్రను వీడటం లేదని ఆరోపించారు. అక్రమంగా బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడంటం లేదని, ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ కట్టడాలను నిర్మిస్తే చర్యలు తీసుకోవాలని సూచించినా అధికారులు మాత్రం మంత్రంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. నిజాంపేట్ లోని అక్రమ కట్టడాలపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి అక్రమ కట్టడాలను గుర్తించాల్సింది పోయి కార్యాలయాల కుర్చీలకే పరిమితమవడం విధులను నిర్వీర్యపరిచినట్లే అవుతుందని అన్నారు. కాలనీ వాసులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై ఫిర్యాదు చేసినా నామమాత్రపు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న తీరు పలు విమర్శలకు దారితీస్తుందని, ఇలా పదుల సంఖ్యలో అక్రమ కట్టడాలు అధికారుల దృష్టికి వెళ్లిన కూడా ఆ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అయ్యారని వెల్లడించారు. కాసులకు కక్కుర్తి పడి అధికారులు అక్రమ నిర్మాణాలను చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారని విమర్శలు వస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు కార్యాలయాల నుంచి బయటకు వచ్చి అక్రమ నిర్మణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

వివాదంలో పీర్జాదిగూడ మిరాకిల్ హాస్పిటల్ కమాన్..

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిరాకిల్ హాస్పిటల్ కమాన్‌పై కార్పొరేషన్‌లో రచ్చ రచ్చ జరుగుతుంది. యాజమాన్యం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మెయిన్ రోడ్డుకు హాస్పిటల్‌కు సంబంధించిన పెద్ద కమాన్ నిర్మించారు. పైగా అధికార పార్టీ బడా నాయకులతో ప్రారంభోత్సవ జరిపించారు. అధికార పార్టీ నాయకులు ఉంటే అనుమతులు ఎవరు అడగరు అనుకు న్నారో, లేక అసలు ముఖ్య అతిథులకు తెలియకుండానే వారితోనే ప్రారంభించేశారో, తెలియదు కానీ, నాయకులను, అధికారులను తప్పుదోవ పట్టించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకుల, అధికారుల కళ్లు గప్పి కమాన్ నిర్మించి, ప్రారంభించిన మిరాకిల్ హాస్పిటల్ యాజ మాన్యం పై చర్యలు తీసుకుని, ప్రారంభించిన కమాన్‌ను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. మిరాకిల్ హాస్పిటల్ కమాన్‌పై పలువురు తమ దృష్టికి తీసుకు వచ్చారని, కమాన్‌కు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని, టౌన్ ప్లాన్ అధికారులను విచారణ చేయమని పూర్తి విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ పోటీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ వెల్లడించారు. స్థానిక సంస్థలలో టికెట్ల కేటాయింపులో యువతకే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్రంలోని 12769 గ్రామపంచాయతీలకు, 5817 ఎంపీటీసీ స్థానాలకు, 539 జడ్పిటిసి స్థానాలకు పోటీ చేస్తుందని తెలిపారు. అదేవిధంగా డిసెంబర్‌లో జరిగే జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో కూడా తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి 2028 లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జిల్లా స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసి తమ పార్టీ ఆశయాలు, లక్ష్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తాం అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిన కాంగ్రెస్ పార్టీనీ, రాష్ట్రాన్ని అవినీతి కుంభకోణాలలో ముంచిన బిఆర్ఎస్ పార్టీని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపిని ఓడించడమే తమ పార్టీ లక్ష్యం అన్నారు. చెరుకూరి రత్నం రాజు, మేకల సారయ్య, ఉప్పుగల్లా సోమన్న, మీదేంటి సురేందర్, దాసరి శ్యామ్ రావు, ఉదయ్ కుమార్, సామ్యూల్, కే. ఎస్ స్వామి, కే.ప్రసంగి గద్దం బాబు, ఖమ్మం స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యుజేకు సుధీర్ఘ చరిత్ర ఉంది

మీడియా డైరీ ఆవిష్కరణలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్.యు.జే) సుదీర్ఘ చరిత్ర కలిగి ఉందని, ఎందరో సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో బాధ్యులుగా కొనసాగి, జర్నలిస్టులకు విశిష్ట సేవలందించిన జ్ఞాపకం ఉందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కొనియాడారు. సమగ్ర మీడియా సమాచారంతో ప్రతి ఏటా జనవరి నెలలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్.యూ.జే) సంఘ ఆనవాయితీగా డైరీని ఆవిష్కరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2025 మీడియా డైరీని మంగళవారం హెచ్.యూ.జే అధ్యక్షులు శిగ శంకర్ గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, టియుడబ్ల్యూజే అధ్యక్షులు కె.విరాహత్ అలీతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బలమూర్ వెంకట్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)ఉప ప్రధాన కార్యదర్శి కల్యారి రాములు, టియుడబ్ల్యూజే కార్యదర్శి వరకాల యాదగిరి, హెచ్ యూ జే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్ మోహియుద్దీన్, అనీల్, హెచ్.యూ.జే ఉపాధ్యక్షుడు ఇబ్రహీం హాజరయ్యారు.

నవీన్ రెడ్డీ నీతిమాలిన చర్యలు మానుకో..

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేను చదువుకున్న కళాశాలను శిథిలావస్థలో చూసి ఎంతో సహృదయంతో కళాశాల నిర్మాణానికి తానే స్వయంగా నడుం బిగించి పుర ప్రముఖులు పారిశ్రామికవేత్తలు వ్యాపారస్తులు అన్ని వర్గాల ఆర్థిక సహకారంతో కనివిని ఎరుగని రీతిలో ప్రభుత్వ కళాశాల భవనం నిర్మిస్తుంటే అభివృద్ధి చూసి ఓర్వలేక కడుపుమంటతో నిందలు వేస్తున్నారని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో పట్టణ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రాతి బాలరాజు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిరుపేద విద్యార్థులు మంచి చదువులను అభ్యసించడానికి పుర ప్రముఖుల సహకారంతో కళాశాల భవనాన్ని కనివిని ఎరుగని రీతిలో నిర్మాణ పనులు మొదలుపెట్టామని అన్నారు. ఎమ్మెల్యే కళాశాలను సందర్శించి అక్కడ పరిస్థితులు చూసి చలించిపోయారని గుర్తు చేశారు. కళాశాల భవనానికి మరమ్మత్తులు చేస్తే ఎక్కువకాలం ఉండదని భావనతో ఒక గొప్ప కళాశాలను దాతల సహకారంతో నిర్మించి భవిష్యత్తు తరాలకు విద్య పట్ల బంగారు భవిష్యత్తును నిరుపేదలకు అందించాలన్న తాపత్రయంతో పనులు చేపడుతుంటే ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కడుపుమంటతో చూసి ఓర్వలేక నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే శంకర్ ఎంతో కష్టపడి ఆనాడు ఇదే కళాశాలలో విద్యను అభ్యసించారని అన్నారు. ప్రజలు వ్యాపారవేత్తలు పారిశ్రామికవేత్తలు ఇచ్చే ప్రతి పైసాకు లెక్క ఉందని చెప్పారు. అదేవిధంగా మండలాల ఏర్పాటు విషయంలో నీతిమాలిన రాజకీయం చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రాతి బాలరాజ్ గౌడ్ విమర్శించారు.

కట్ట మైసమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : కట్ట మైసమ్మ జాతరకు ఏర్పాట్లు పకడ్బందిగా నిర్వహించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం కట్ట మైసమ్మ దేవాలయం వద్ద అత్యంత వైభవోపేతంగా ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్న "శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర" ను విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆలయ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ కట్ట మైసమ్మ అమ్మవారి జాతరకు ప్రతి యేట లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని, నీటి సదుపాయం, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంపు వంటి ఏర్పాట్లను అన్ని విభాగాల అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, జిహెచ్‌ఎంసి ఉప కమిషనర్ మల్లారెడ్డి, సీఐ భరత్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ జీఎం అశోక్, ఈఈ క్రిష్టప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మన్నె బాలేష్, సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, ప్రసాద్, మల్లేష్, దారం సాయి, కృష్ణారెడ్డి, ఈ. సురేష్, ఇంద్రసేన, సాయి గౌడ్, మహేష్ కుమార్, శివరాజ్, వెంకటేష్, లక్ష్మారెడ్డి, గోపాల్ మరియు డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అంకుషాపూర్ ఏసిఈ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రతా మాసం 2025 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహణ సదస్సులో కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ మేరకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లా అతివేగం, రోడ్డు భద్రత ప్రమాణాలు మర్చి వాహనాలు నడపడంతోనే ప్రమాధాలు జరుగుతాయని, వాహనాలు నడుతుపున్న సమయంలో తమపై ఉన్న బాధ్యతలను గుర్తించుకొని నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత డిసిపి కె. మనోహర్, ట్రాఫిక్ 1 డిసిపి ఎస్. మల్లారెడ్డి, ట్రాఫిక్ 2 డిసిపి వి. శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఏసిఈ కళాశాల విద్యార్థులు, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులు దాదాపు 12వందల మందితో పాటు శ్రీనివాస్ ట్రావెల్స్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్న డిఎస్ఓ అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వనపర్తి డీఎస్ఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్నా తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించి తన కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బంధువుల అకౌంట్ లోకి డబ్బులు వేయించుకున్నారని ఆరోపించారు. పక్క జిల్లా మిల్లులకు కేటాయింపులు చేసినందుకు బస్తాకు రూ.5 దండుకున్నారని, కొన్ని మిల్లుల నుంచి ఏక మొత్తంగా రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు లంచాలు తీసుకున్నారన్నారు. విద్యుత్ కనెక్షన్ లేకున్నా, కెపాసిటీకి మించి కొన్ని మిల్లులకు కేటాయింపులు చేశారని, డబ్బులు ఇచ్చిన వారికి సన్నధాన్యం, ఇవ్వనివారికి దొడ్డు రకాలు కేటాయింపులు చేశారని, వీటిపై విచారణ జరపాలని కోరారు. అధికారుల అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివి గౌడ్ సంపత్ కుమార్, గాలిగల్ల సాయిబాబా, మహేందర్ నాయుడు, బత్తుల జితేందర్ గౌడ్, రమేష్ సాగర్, తిరుపతయ్య గౌడ్, దేవర శివ, గౌతమ్ శంకర్, మేఘనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడ్డ ఇళ్లను కూల్చివేయాల

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్‌తో కలిసి బుధవారం చిన్మయ మార్గం కాలనీవాసులు హైడ్రా కమిషనర్ రంగనాథులు కలిశారు. ఇటీవల మిర్జాగూడ చిన్మయి మార్గ్ అసోసియేషన్ ప్రతినిధులు 66 ఫీట్ల మాస్టర్ ప్లాన్ ఉందని దానికి అనుగుణంగా రోడ్డు ఆక్రమణలకు పాల్పడ్డ ఇళ్లను కూల్చివేయాలని హైడ్రాను ఆశ్రయించారు. స్పందించిన హైడ్రా బృందం కొద్ది రోజుల క్రితం చిన్మయి మార్గ్‌కు వచ్చి రోడ్డు ఆక్రమణలకు గురైన ఇళ్లను గుర్తించి మార్కింగ్ చేసి వెళ్లారు. దీంతో బాధితులు బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్‌లతో కలిసి హైడ్రా కమిషనర్‌ను కలిశారు. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు తెలుసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, చిన్మయి మార్గ్ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల సేవలు అమూల్యమైనవి

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో సీనియర్ సిటిజెన్స్ చేస్తున్న సేవలు, వారి సలహాలు, సూచనలు అమూల్యమైనవని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు పీ.నర్సి రెడ్డి అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. వృద్ధులు తమ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నో సంవత్సలుగా ఎదురుచూస్తున్న శాశ్వత భవనం కల త్వరలోనే నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందులో భాగంగా పాలక మండలి సుమారు రూ.30లక్షలతో తీర్మానం చేయడం జరిగిందని త్వరలోనే నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలకు సేవ చేసే అవకాశం కలిపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ సీనియర్ సిటిజెన్ భవన నిర్మాణానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేందర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అరకొర ఏర్పాట్లు... వీఐపీ సంస్కృతి

- కేంద్రం, యూపీ ప్రభుత్వాలపై ప్రతిపక్షాల మండిపాటు
- సమర్థుల చేతికి కుంభమేళా నిర్వహణ: కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సగం సగం పనుల వల్లే తొక్కిసలాట జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. మహా కుంభమేళా నిర్వహణను యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కంటే సమర్థవంతమైన వ్యక్తికి అప్పగించాలని సూచించింది. కుంభమేళాకు వీవీఐపీల రాకపోకలను నియంత్రించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దీనిపై 'ఎక్స్' వేదిక స్పందించారు. "మహా కుంభమేళాలోని త్రివేణి సంగమం ఒడ్డున జరిగిన తొక్కిసలాటలో భక్తుల మరణాలు, గాయపడిన వార్తలు నన్ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. వీఐపీల రాక, సెల్ఫ్ ప్రమోషన్ వంటివి ఆపాలి. చాలా ముఖ్యమైన షాహీ స్నానాలు ఇంకా మిగిలి ఉన్నాయి. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలి. వసతి, ఆహారం, ప్రథమ చికిత్స మొదలైన వాటిని భక్తులకు కల్పించాలి. వీఐపీల కదలికలను నియంత్రించాలి. మన సాధువులు, ఋషులు కూడా ఇదే కోరుకుంటున్నారు. బాధితులకు కాంగ్రెస్ కార్యకర్తలు సాయం చేయాలి. కుంభమేళా కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేసినా ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి" అని పేర్కొన్నారు.

నిర్వహణ లోపం వల్లే తొక్కిసలాట: రాహుల్ గాంధీ

ప్రయాగ్ రాజ్ మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట కారణంగా అనేక మంది భక్తులు మరణించడం, గాయపడడం బాధాకరమని లోక్ సభలో విపక్షనేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తెలిపారు. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. నిర్వహణ లోపం, సాధారణ భక్తుల కంటే వీఐపీల రాకపై అధికారుల ప్రత్యేక దృష్టి పెట్టడమే ఈ విషాద సంఘటనకు కారణం. బాధిత కుటుంబాలకు సాయం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలను అభ్యర్థిస్తున్నాను" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మరణించడం చాలా బాధాకరమని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేడా తెలిపారు. కుంభ మేళాకు అరకొరగానే ఏర్పాట్లు చేశారని ఆరోపించారు. ఇంకా చాలా మంది పుణ్య స్నానాలు ఆచరించేందుకు త్రివేణి సంగమానికి వస్తారని, కాబట్టి అదనపు భద్రతా దళాలను అక్కడికి మోహరించాలని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.

భక్తుల మృతి బాధాకరం: అఖిలేశ్

మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. "మహా కుంభమేళాలో జరిగిన దుర్ఘటనలో భక్తులు మరణించారనే వార్త చాలా బాధాకరం. క్షతగాత్రులను ఆదుకోవడానికి, గందరగోళాన్ని అరికట్టడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడానికి ఎయిర్ అంబులెన్స్ లను మోహరించాలి. శాంతి భద్రతలను కాపాడుకోవడానికి మెరుగైన నిఘా అవసరం. ఈ క్లిష్ట సమయంలో భక్తులు ఓపికగా, ప్రశాంతంగా ఉండాలి" అని అఖిలేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆ ఘటన చాలా విచారకరం: మాయావతి

కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడం విచారకరమని యూపీ మాజీ సీఎం, బీఎస్పీ అధినేత్రి మాయావతి తెలిపారు. బీఎస్పీ కార్యకర్తలు బాధితులకు అండగా ఉండాలని ఆమె కోరారు. ఈ మేరకు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

యోగి సర్కారు వైఫల్యం: ఆప్

కుంభమేళా తొక్కిసలాట ఘటనపై ఆప్ జాతీయ ప్రతినిధి అనురాగ్ ధండా స్పందించారు. "ఇది చాలా విచారకరమైన వార్త. కోట్లాది మంది భక్తులు కుంభమేళాకు తరలివచ్చారు. యూపీ సీఎం యోగి అక్కడ ఉండకుండా దిల్లీకి ఎన్నికల ప్రచారం కోసం వచ్చారు. వీఐపీల భద్రత కోసం అన్ని ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లతో సామాన్య ప్రజలు మిగిలిపోయారు" అని అనురాగ్ ధండా విమర్శించారు.

సింహాచలం పంచ గ్రామాల సమస్యకు
త్వరలో పరిష్కారం

- సీఎం చంద్రబాబు నేతృత్వంలో కీలక సమీక్ష
- రెవెన్యూ మంత్రి అనగాని

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖపట్నం జిల్లా సింహాచలం పంచ గ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఈ అంశంపై సీఎం చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం ముఖ్య నేతలతో పాటు రెవెన్యూ, దేవాదాయ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో బుధవారం కీలక సమీక్ష జరిగిందని... ఏళ్లతరబడి ఉన్న ఈ సమస్యపై ఉన్నతాధికారులందరితో సీఎం మాట్లాడారని తెలిపారు. సింహచలం పంచ గ్రామాల సమస్యపై పరిష్కారాన్ని ఆయన సూచించారని వివరించారు. అయితే దీనిపై న్యాయ సలహా తీసుకున్న తర్వాత 12,149 నివాసాలను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం ముందుకు తీసుకు వెళుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా దాదాపు రూ.5,300 కోట్ల విలువ చేసే 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సింహాచలం దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పి అశోక్ గజపతిరాజు కూడా ఆమోదం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. 70 వేల మందికి మంచి జరిగేలా 296 జీవోను గతంలో టీడీపీ ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ కేసులను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. 0 నుంచి150 గజాలున్న వాటికి ఎలాగయితే రెగ్యులరైజ్ చేస్తున్నామో... అదే విధంగా పంచ గ్రామాల సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇక పాత తేదీ ప్రకారం పట్టాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గాజువాక ప్రాంతంలో గతంలో 301 జీవో ఇవ్వడం వల్ల 2018 నుండి ఈ సమస్య నడుస్తోందని గుర్తు చేశారు. ఆ జీవోను సైతం సవరించి వారికి కూడా న్యాయం చేయాలని నిర్ణయం తీసుకుంటామన్నారు. చంద్రబాబుతో జరిగిన సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, విశాఖపట్టణానికి చెందిన ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మల శకటానికి జ్యూరీ అవార్డు

30 ఏళ్ల తర్వాత రాష్ట్రానికి దక్కిన బహుమతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ రాజధాని దిల్లీలో 76వ గణతంత్ర దినోత్సవంలో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. రాష్ట్రంలోని చేతి వృత్తుల కళా ప్రాముఖ్యతను చాటుతూ, ఆంధ్ర ప్రదేశ్ వారసత్వ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటి కొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన ఏపీ ప్రభుత్వ శకటం గణతంత్ర దినోత్సవంలో ప్రత్యేకంగా నిలిచి యావత్ దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షించింది. సామాజిక మాధ్యమాలలో సైతం లక్షలాది మంది ఈ శకటానికి మంత్రముగ్ధులై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఈ శకటాన్ని రూపొందించింది. శకటం ముందు వినాయకుడు, చివర కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఎత్తయిన రూపాలతో, రెండు వైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టు ప్రతిబింబించేలా అమర్చిన ఏటికొప్పాక బొమ్మల కొలువుతో శకటం ఆద్యంతం ఆకట్టుకుంది. శకటం నడుస్తున్నంత సేపు ఏటి కొప్పాక బొమ్మల ప్రాశస్త్యాన్ని చాటుతూ 'బొమ్మలు బొమ్మలు ఏటికొప్పాక బొమ్మలు, ఆంధ్ర ప్రదేశ్ బొమ్మలు, ఇవి విద్యను నేర్పే బొమ్మలు, వినోదాల బొమ్మలు, భక్తి చాటే బొమ్మలు, హస్తకళల హంగులు, సహజ ప్రకృతి రంగులు' అంటూ సాగే గీతంతో ప్రజల హృదయాలను దోచుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సైతం ఈ శకటం మనోహరమైన రూపాన్ని చూసి పులకించిపోయారు. అలాగే నెటిజన్లు సైతం ఏపీ ప్రదర్శించిన ఏటి కొప్పాక బొమ్మల శకటాన్ని పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఓటింగ్‌లో కూడా పెద్ద ఎత్తున ఏటికొప్పాక శకటానికి మద్దతు పలికారు. దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాలలో ప్రదర్శించే శకటాలకు సంబంధించి 30 సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆంధ్ర ప్రదేశ్ శకటానికి కేంద్ర ప్రభుత్వ జూరీ పురస్కారం లభించింది. ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ తృతీయ బహుమతి ప్రకటించింది.

సీఎం, ఉప ముఖ్యమంత్రి ప్రశంసలు

ఏటికొప్పాక శకటానికి జ్యూరీ అవార్డు రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. శకటాన్ని రూపొందించిన సంబంధిత శాఖా సిబ్బంది, అధికారులను అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ తమ సామాజిక మాధ్యమల వేదికగా ఈ శకటాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఏటి కొప్పాక బొమ్మలకు జియో ట్యాగింగ్ చేసి, ఈ బొమ్మలు అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

త్వరలోనే అక్రిడిటేషన్ల జీవో

ఏపీయూడబ్ల్యూజే నేతలకు మంత్రి పార్థసారథి హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అక్రిడిటేషన్ల జీవోపై కసరత్తు పూర్తయిందని... త్వరలోనే జీవో విడుదల చేసి సకాలంలోనే అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో తనను కలిసిన ఏపీయూడబ్ల్యూజే. ప్రతినిధి బృందానికి మంత్రి ఆమేరకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన బృందంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సురేష్ కుమార్ రెడ్డి ఉన్నారు. అక్రిడిటేషన్ల సంఖ్యను కుదించడం కోసం గత ప్రభుత్వం విధించిన అడ్డగోలు నిబంధనలను తొలగించి, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు దక్కేలా చూడాలని యూనియన్ నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీలకు గతంలో ఉన్న విచక్షణాధికారాలను పునరుద్ధరించాలని, జీవో విడుదలలో జాప్యం లేకుండా చూడాలని, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం కోరింది. మంత్రి కొలుసు పార్థసారథి యూనియన్ నాయకుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ జి.అనితతో కూడా యూనియన్ నాయకులు భేటీ అయ్యారు.

జగన్ క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా వాయిదా పడింది. విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో నారాయణ దాఖలు చేసిన కేసుకు సంబంధించి జగన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు మంత్రి నారాయణ తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సమయం కోరారు. వరుసగా విచారణకు సమయం కోరుతున్నారని, పిటిషన్‌ను రెగ్యులర్‌గా విచారించాలని జగన్ తరపు న్యాయవాది శ్రీరామ్ కోరారు. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కోరడంతో హైకోర్టు విచారణను మూడు వారాలపాటు వాయిదా వేసింది. అమరావతి రాజధాని నిర్మాణంలో చేపట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ మార్పుల వెనుక అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ పాత్ర ఉందంటూ ఓ పత్రికలో కథనాలు తన పరువుకు నష్టం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తూ... విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో ఆయన పిటిషన్ వేశారు. దీనిపై గతంలో అక్కడ విచారణ కొనసాగింది. జగన్ హాజరు కావాలని అనేక సార్లు కోర్టు సమన్లు పంపినా ఆయన వెళ్లలేకపోయారు. అనంతరం మంత్రి నారాయణ దాఖలు చేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని హైకోర్టులో జగన్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

ఆర్ఐఓను సస్పెండ్ చేయాలి

- విద్యార్థిని వేధించిన కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి
- నారాయణ కళాశాల ముట్టడి
- ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్... విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: నారాయణ విద్యా సంస్థల తొత్తుగా వ్యవహరిస్తున్న ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని నారాయణ విద్యా సంస్థలో ఐదు రోజుల క్రితం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ ఫీజు వేధింపులు తట్టుకోలేక కళాశాల భవనం పై నుంచి దూకి మృతి చెందాడు. తక్షణమే నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల అధ్వర్యంలో సోమల్దొడ్డి అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి ర్యాలీగా వెళ్లి నారాయణ కళాశాల ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థి నాయకులను అడ్డుకుని, అరెస్ట్ చేసి అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కళాశాల ముట్టడి కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలలో లక్షల రూపాయలు ఫీజులు కట్టి తమ పిల్లలను తల్లిదండ్రులు కళాశాలల చేతిలో పెడితే విద్యార్థులకు మంచి విద్యను అందించకుండా ఫీజులు చెల్లించని వారిని వేధింపులకు గురి చేయడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులను ప్రయోజకులను చేయకుండా, వారి శవాలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల భవనం పై నుంచి విద్యార్థి దూకి మరణిస్తే పోలీసులు ఇంతవరకు నారాయణ విద్యా సంస్థ యాజమాన్యంపై కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు. ఈ ఘటనపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్థిక శాఖ మంత్రి, వైద్య శాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ముగ్గురూ ఇంతవరకు నోరు మెదపలేదన్నారు. ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ నారాయణ విద్యాసంస్థలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి... విద్యార్థి చనిపోయినప్పటికీ, కళాశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించనప్పటికీ ఆ కళాశాలలో ఏమి జరిగిందనే నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించలేదని విమర్శించారు. తక్షణమే ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, కళాశాల యాజమాన్యం ఘటనా స్థలంలో రక్తపు మరకలను చెరిపివేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదని, విద్యార్థి సంఘాల నాయకులు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినప్పటికీ దానిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పోలీసు యంత్రాంగం, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని, నారాయణను మంత్రివర్గం నుంచి తొలగించాలని, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూవై రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, పీఎన్ఐవీ కార్యదర్శి వినోద్ కుమార్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధు, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు, సిద్ధు, ఐక్య విద్యార్థి సంఘం నాయకులు అంజి, వంశీ, మంజు, చందు, గిరి, సాయి, రాజేష్, కార్తీక్, నాని, సమీర్, యశ్వంత్, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎల్ నారాయణకు 'తుమ్మల' పురస్కారం

విశాలాంధ్ర-తెనాలి: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి ఎర్రజెండా కవి, అభ్యుదయ రచయిత తుమ్మల వెంకట్రామయ్య స్మారక సాహితీ పురస్కారాన్ని సీనియర్ పాత్రికే యులు, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ నాయకులు, తెనాలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి.ఎల్.నారాయణకు అరసం గుంటూరు జిల్లా శాఖ అందజేసింది. తెనాలి గాంధీనగర్ కవిరాజు పార్కులో వల్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్ భవనంలో గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్వర్యంలో 2025 సంవత్సర తుమ్మల సార్మక సాహితీ పురస్కార మహోత్సవ సభ బుధవారం జరిగింది. అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ బాబు ఆర్ వల్లమూడి మాట్లాడుతూ బి.ఎల్.నారాయణ తెనాలి కేంద్ర విలేకరిగా సామాజిక మార్పు కోసం ఆయన కలం నుంచి వెలువడిన కథనాలు ప్రజా చైతన్యానికి దోహదపడ్డాయన్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అఖిల భారత అరసం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తుమ్మల వెంకట్రామయ్య అభ్యుదయ రచయితగా సమాజ శ్రేయస్సుకు నిస్వార్థంగా కృషి చేశారని తెలిపారు. తుమ్మల రాసిన ఎర్రజెండా పాట గొప్ప సంచలనాన్ని సృష్టించిందన్నారు. పురస్కార గ్రహీత, పాత్రికేయులు బి.ఎల్.నారాయణ కలం నుంచి వచ్చిన కథనాలకు వచ్చిన స్పందనలు అపూర్వమన్నారు. కాళోజి, వావిలాల, గాడిచర్ల, ఏపీయూడబ్ల్యూజే, నార్ల, దేవినేని, జి.ఎల్.ఎన్.గాంధీ అవార్డులు అందుకున్న ఉత్తమ పాత్రికేయుడు నారాయణ అని, ఆయనకు ప్రతిష్ఠాత్మక తుమ్మల పురస్కారం అందించడంలో అరసం సఫలీకృతమయిందని తెలిపారు. సినీరచయిత సాయిమాధవ్ బుఱ్ఱా మాట్లాడుతూ తుమ్మల, బి.ఎల్.నారాయణ, పెనుగొండ లక్ష్మీనారాయణ సాహితీ విశేషాలను వివరించారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్ మాట్లాడుతూ తెనాలిలో జరిగిన అరసం నిర్మాణం నుంచి ప్రతి దశలోనూ నారాయణ కీలక పాత్ర వహించారన్నారు. రావిపాటి వీరనారాయణ, రామరాజు, రచయితలు, సాహితీవేత్తలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

నందిగం సురేశ్‌కు బెయిల్... విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ఎంపీ నందిగం సురేశ్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఓ మహిళపై హత్య కేసులో నమోదయిన సంఘటనలో సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కొంతకాలంగా గుంటూరు జైలులో ఉన్నారు. గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు మంగళవారం సురేశ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఇచ్చారు. 2020 డిసెంబరు 27న వెలగపూడిలో జరిగిన దాడి ఘటనలో మెండెం మరియమ్మ అనే మహిళ మృతి చెందారు. ఆ కేసులో భాగంగా తుళ్లూరు పోలీసులు... సురేశ్‌పై హత్య, ఇతర నేరాల కింద కేసులు నమోదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక సురేశ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించింది. బెయిల్ కోసం ఆయన హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

మెగా డీఎస్సీ ఏమైంది?

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం: పరుచూరి

విశాలాంధ్ర-రాజమండ్రి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, మెగా డీఎస్సీ ఊసే లేదన్నారు. సుదీర్ఘ అనుభవం గల చంద్రబాబు మాట ఇచ్చి తప్పడం బాధాకరమన్నారు. ఏఐవైఎఫ్ తూర్పు గోదావరి జిల్లా 21వ మహాసభ రాజమహేంద్రవరంలోని అంబల్లా సూర్యారావు భవన్‌లో బుధవారం జరిగింది. తొలుత యువత భారీ ప్రదర్శన నిర్వహించింది. ఏఐవైఎఫ్ పతాకాన్ని ఏఐవైఎఫ్ మాజీనేత తాటిపాక మధు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారని, మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసినా... నిర్వహణలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన హామీ ఏమైందని నిలదీశారు. డీఎస్సీ కోసం అభ్యర్థులు వేలాది రూపాయలు కోచింగ్ సెంటర్లకు పెట్టాల్సి వస్తుందన్నారు. ఉద్యోగాలు రావనే నిరాశతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన చాలామందిని విధుల నుంచి తొలగించి వారి కడుపుపై కొట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,500 మంది గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం షాపులలో వివిధ స్థాయిల్లో పనిచేశారని, వారందరినీ రోడ్డున పడేశారని ఆరోపించారు. వలంటీర్లను తొలగించడం దారుణమన్నారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఫిబ్రవరి 6 నుండి 9 వరకు శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలు జరుగుతున్నాయని, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యచరణపై చర్చించి... నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్ త్రిమూర్తులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్ (రాజమండ్రి రూరల్), ప్రధాన కార్యదర్శిగా పి.త్రిమూర్తులు (జిల్లా సెంటర్) ఉపాధ్యక్షులుగా చింతలపూడి సునీల్ (గోపాలపురం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.రామచంద్రరావు (రాజమండ్రి సిటీ), సహాయ కార్యదర్శిగా బి.రాజు (అనపర్తి), కోశాధికారిగా బాబు భరత్ (రాజానగరం)తో పాటు కమిటీ సభ్యులుగా మరో 9 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.